అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత...

బెల్టుషాప్ నిర్వాహకుడిపై కేసు

నవతెలంగాణ-కాటారం

మల్హర్ మండలంలోని తాడిచెర్లలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కుంట సదానందం అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు కాటారం ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. వారి కథనం ప్రకారం మల్హర్ మండల పరిధిలో కాకుండా పెద్దపల్లి జిల్లా నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ జోరుగా అమ్మకాలు జరుపుతున్నాడనే సమాచారం మేరకు మంగళవారం కాటారం ఎక్సైజ్ శాఖ సిఐ ప్రశాంతి ఆదేశాల మేరకు ఎస్ఐ గంగాధర్ సిబ్బందితో బెల్టు దుకాణంపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.12 వేల విలువైన పెద్దపల్లి జిల్లాకు చెందిన మద్యం లభించినట్లు ఎస్ఐ చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని బెల్టు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అనుమతి లేని విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

నవతెలంగాణ- కాటారం

ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్మితే చర్యలు తప్పవని కాటారం ఎస్సై శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్కే శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం కాటారం మండలం కేంద్రంలోని రైతు వేదికలో మండల పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్, సీడ్స్ వ్యాపార దుకాణదారులకు, డీలర్లకు పురుగుమందుల విత్తనాలు, ఎరువుల చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణదారుడు విత్తనాలు, పురుగు మందు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరల ప్రకారం విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు అమ్మినట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పక అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, ఏఈఓ శ్రీలత, డీలర్లు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ములుగులో మంత్రి కేటీఆర్ పర్యటన

ఏర్పాట్లను మంత్రి సత్యవతి రాథోడ్ పరిశీలన





నవతెలంగాణ- ములుగు

నేడు ములుగు జిల్లాలో రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో మంగళవారం మరోసారి ఏర్పాట్లను రాష్ట్ర గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ దగ్గరుండి పరిశీలించారు. ములుగు జిల్లాకు చేరుకున్న మంత్రి ముందుగా గట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ పరిశీలించారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం బహిరంగ సభ వేదిక, ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో మంత్రి చర్చించారు. సభ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్ప చెరువు వద్ద దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న సాగునీటి దినోత్సవ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేటీపీపీలో... దొంగలు ....

రూ.80 లక్షల సొత్తు మాయం

ఇంటి దొంగల పనేనని అనుమానం

ఉన్నతస్థాయి అధికారి, మరో ఆరుగురు అధికారుల హస్తం !

విచారణ చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-గణపురం

కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో దొంగలు పడ్డారు. దాదాపు రూ.80 లక్షల విలువచేసే పరికరాలను ప్లాంట్‌లో పనిచేసే కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఎత్తుకెళ్లారు. ఈ దొంగతనంలో ఒక ఎస్ఈ స్థాయి అధికారి మరో ఆరుగురు అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం బాయిలర్ ట్యూబ్‌లు సాంకేతిక లోపంతో ప్రతిసారి రిపేర్ అవుతుంటాయి. ఈ క్రమంలో వాటిని రిపేర్ చేసేందుకు దాని పక్కనే ఒక స్టోర్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో రాగి తీగ, బుష్, నట్లు తదితర వస్తువులు ఉంచుతారు. తాజాగా బీహెచ్ఈఎల్ కంపెనీ నుండి పరికరాలు కొనుగోలు చేసి అందులో దాచిపెట్టారు. మూడు రోజులకోసారి ఒక అధికారి సమక్షంలో స్టోర్ రూమ్ తాళాలు తీసి పరికరాలు ఉన్నాయో లేవో చూస్తారు. కాగా కొందరు ఆ స్టోర్ రూమ్ తాళాలు పగలగొట్టి పరికరాలను ఎత్తుకుపోయారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించేందుకు వచ్చిన అధికారికి ఆ రూమ్ లో వస్తువులు ఏమీ లేకపోవడంతో జెన్కో సిఈకి సమాచారమిచ్చాడని, దీంతో సీఈ గుట్టు చప్పుడు కాకుండా విచారణకు ఆదేశించాడని సమాచారం. ఇంత పెద్ద దొంగతనం జరిగినా ప్రెస్ మీట్ పెట్టకపోవడం, బయటికి చెప్పకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. సీఈ ఒంటెద్దు పోకడ వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఆయన విధుల్లో చేరినప్పటి నుండి ఇలాంటి దొంగతనాలు జరుగుతూనే ఉండడం గమనార్హం.

కేటీపీపీలో ఏం జరిగింది ?

కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోకి చీమైనా దూరని పరిస్థితిలో భారీ ఎత్తున దొంగతనం ఎలా జరిగిందనేది అర్థం కాని పరిస్థితి. భారీ సెక్యూరిటీ. అణువణువు సీసీ కెమెరాలు, భారీ బందోబస్తు ఉన్నప్పటికీ ఇంత పెద్ద దొంగతనం జరగడంపై ఇంటి దొంగలే దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కేటీపీపీ ప్రధాన గేటు నుండి ఉద్యోగులు తప్ప మరెవరిని లోపలికి పంపరు. ఐడెంటీ కార్డు పరిశీలించాకే లోపలికి అనుమతిస్తారు. వారు విధులు ముగించుకొని ఇంటికి వచ్చేటప్పుడు కూడా వారి వాహనాలను వారిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాతే పంపిస్తారు. అలాంటిది ఇంత పెద్ద ఎత్తున దొంగతనం జరగడంపై సెక్యూరిటీ, మరి కొంతమంది అధికారులు కలిసి భారీ వాహనంలో పరికరాలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఒక ఎస్ఈ స్థాయి అధికారి మరో ఐదుగురు అధికారులు సెక్యూరిటీ సిబ్బందిపై విచారణ జరుపుతున్నారు. కాగా విచారణలో నిజం తేలితే ఆరుగురు అధికారులను సస్పెండ్ చేసే అవకాశం ఉంది. కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో గతంలో కూడా ఇలాంటి దొంగతనాలు జరిగాయి. సెక్యూరిటీ అధికారులు ఒక్కటై కాపర్ వైర్లు, ఇనుప సామాన్లు దొంగలించుకుపోయిన దాఖలాలు ఉన్నాయి. అప్పటినుండి ఇప్పటివరకు ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.



జనగామ జిల్లా బ్రాండ్ నిలపాలి

జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

నవతెలంగాణ-జనగామ

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో జనగామ జిల్లా బ్రాండ నిలపాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అధ్యక్షతన స్థానిక భ్రమరాంబ గార్డెన్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ శివలింగయ్య హాజరై మాటాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశ విదేశాల నుండి పరిశ్రమల స్థాపనకు రాష్ట్రానికి వస్తున్నారని అన్నారు. అటు ఐటీ పరిశ్రమకు కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. ఎక్కడైనా కనీస మౌలిక వసతుల కల్పన అనుమతులు లభిస్తే అక్కడ వ్యాపారం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వివిధ పరిశ్రమల స్థాపనకు జనగామ జిల్లా అనుకూలమైన ప్రదేశం అన్నారు. జిల్లాలో ఏ పరిశ్రమ అయినా, చేనేత రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. జిల్లాలో అన్ని పరిశ్రమలను ప్రోత్సహించడం తోపాటు నూతన పరిశ్రమలకు అను మతులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లాలో మల్బరీ ఉత్పత్తికి రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు ప్రారంభ దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. దీంతో జనగామ జిల్లా మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. అంతకుముందు పరిశ్రమల, చేనేతశాఖ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. ఆ శాఖపై సంబంధిత అధికారులు నివేదిక సమర్పించారు. అనంతరం సభా ప్రాంగణంలో చేనేత జౌళి శాఖ, విజయ డైరీ, గ్రినేట్, పరిశ్రమ ప్రదర్శనలు తిలకించారు. అనంతరం మగ్గంపై నూలు పోశారు. నేతన్నకు చేయూత పథకం, చెక్ ల పంపిణీ చేసి, నేతలకు బీమా పాలసీ బాండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రమేష్, చేనేత శాఖ ఏడి చౌడేశ్వరి, ఎంపీపీ కళింగరాజు, కార్పొరేటర్లు డీఏఓ వినోద్‌కుమార్, సంబంధిత విభాగాల అధికారులు, వివిధ పారిశ్రామిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

పంచాయతీరాజ్ శాఖ

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మడికొండ ఐటీ పార్కులో

పారిశ్రామిక ప్రగతి దినోత్సవ వేడుకలు




నవతెలంగాణ-కాజీపేట

ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన వరంగల్ జిల్లా ఇప్పుడు పారిశ్రామిక రంగంలో పరుగులు తీస్తోందని, పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు భారీగా పెట్టు బడులు పెరిగాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవలలో భాగంగా మడికొండ ఐటీ పార్క్‌లో మంగళవారం పారిశ్రామిక ప్రగతి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అరూరి, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో మంత్రి హాజరై వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడి రాష్ట్రంలో వలసలు ఆగిపోయాయన్నారు. వరంగల్ నగరం పారిశ్రామికంగా ఎదగడానికి ఎన్నో వనరులు ఉన్నా గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదని ఫలితంగా వేలాది మంది ముంబయి, దుబాయి, భీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత టిఎస్ ఐపాస్ ద్వారా నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకువచ్చి సులభతరమైన అనుమతులు కల్పించడంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. టీఎస్ ఐపాస్ విధానం ద్వారా సుమారు 2,64,956 కోట్ల పెట్టుబడులతో 23,188 యూనిట్లకు అనుమతులు ఇవ్వటం జరిగిందని, 17,77,987మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఓరుగల్లు ఐటీ పార్క్‌లో సైయింట్, టెక్ మహేంద్ర, సాఫ్ట్‌పాత్, క్వాడ్రంట్ రిసోర్సెస్ వంటి సంస్థలు తమ బ్రాంచీలను ఏర్పాటు చేశాయని అన్నారు. త్వరలోనే జెన్‌ప్యాక్ట్, హెచ్‌ఆంహెచ్ నెక్స్, హెక్సాడ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఐటీ కంపెనీలు సంస్థలను ఏర్పాటు చేయనున్నాయని, వరంగల్ ప్రాంతానికి చెందిన యువతకు సొంతూరులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే అవకాశం దక్కనుందన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ పరిధి కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో ఒక్కో కంపెనీ ప్రారంభమవుతోందని, ఇప్పటికే గణేశ ఎకోటెక్స్ కంపెనీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందులో 400మంది పనిచేస్తున్నారని అలాగే కేరళకు చెందిన టైటక్స్ కంపెనీ అండర్ కన్‌స్ట్రక్షన్‌లో ఉందని,కంపెనీ ప్రారంభమైతే 4వేలమంది మహిళలకు ఉపాధి లభించనుందని తెలిపారు. దక్షిణకొరియాకు చెందిన ఎంగాన్ అనే కంపెనీకి భూమి కేటాయింపు జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. మడికొండ లోని పవర్ లుమ్ క్లస్టర్ టెక్స్టైల్ ఇండస్ట్రీ నేడు ఇండియాలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో రాష్ట్ర అభివద్ధి పథంలో ముందుకు వెళుతుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కంపెనీలను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అరురి రమేష్ మాట్లాడుతూ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలో ఐటీ కంపెనీల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నిక్తా పట్నాయక్, జెడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, కుడా చైర్మన్ సుందర్ రాజ్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షురాలు లలితా యాదవ్, ఇండస్ట్రీస్ జీఎం హరి ప్రసాద్, టీఎస్ఐఐసీ జెడ్ఎం సతీష్ కుమార్, టెక్స్టైల్ అండ్ హ్యాండ్ లుమ్ ఏడి రాధికా రెడ్డి, కార్పొరేటర్లు మునిగాల సరోజన కర్జాకర్, ఇండ్ల నాగేశ్వర్ రావు, తూర్పటి సులోచన సారయ్య, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ కష్ణ ప్రసాద్, పారిశ్రామిక వేత్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడి మనదే.. బాధ్యత మనదే..

మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్దూ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

బడి మనదే బాధ్యత మనదేనాని మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరాణి సిద్దు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం భూపాలపల్లి మండలంలోని జంగేడు ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గడపగడపకు తిరిగి ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలను విద్యార్థులను చేర్పిం చాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. .జీవిత సమస్యల పరిష్కారం విద్య ద్వారా సాధ్యమవుతుందని అన్నారు. విద్యా వంతులు ఎక్కువగా ఉంటే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మన బస్తి మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తున్నదాన్నరు. అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వం సేవలను వినియోగించుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య, ఉపాధ్యాయులు బాబురావు, హనీఫ్ ,వాణి, విజయలక్ష్మి ,హేమలత, రాజ కవిత, వెంకటేశ్వర్లు, రమేష్, కుసుమ కృష్ణమోహన్, స్వామి, మల్సూర్, శోభారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.





పరిశ్రమలశాఖ ద్వారా

యువతకు ఉపాధి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా ఎంతోమంది యువతకు రాయితీ రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించిందని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఐదవ రోజు మంగళవారం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమలశాఖ అధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్మన్ అంగోత్ బిందు పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్రంలో పరిశ్రమలశాఖ ద్వారా ఎంతో మందికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఎందరికో ఉపాధి కల్పించినట్టు చెప్పారు. జిల్లాలో కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తూ కుల వృత్తుల వారికి సహాయం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, బానోత్ రవికుమార్, వైస్ చైర్మన్ ఎండి ఫరీద్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ములుగు ప్రజల డిమాండ్లు పరిష్కరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క



నవతెలంగాణ - ములుగు

ప్రజల ఆకాంక్ష మేరకు ఈ ప్రాంత ప్రజల ఉద్యమాల ద్వారానే ములుగు జిల్లా ఏర్పాటు జరిగిందని, నేడు ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న కేటీఆర్ తమ ప్రాంత ప్రజల డిమాండ్లను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క కోరారు. ములుగు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే సీతక్క మాట్లాడారు. ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బుధవారం ములుగు పర్యటన సందర్భంగా తమ ప్రాంత ప్రజల సమస్యలు మా డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. తలాపునే గోదావరి ఉన్న తమ ప్రాంతానికి చుక్క నీరు ఇవ్వని పరిస్థితి ఉందని అన్నారు. ములుగు ప్రాంతానికి గోదావరి జలాలు అందించే విధంగా మంత్రి కేటీఆర్ దృష్టి సారించాలి అన్నారు. రామప్ప నుండి లక్నవరం వరకు కెనాల్ మంజూరు అయి భూ సేకరణ పూర్తి అయినప్పటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు. గోదావరిలో లిఫ్ట్ ఏర్పాటు చేసి పెద్ద చెరువులు నింపి గోదావరి జలాలు అందించాలన్నారు. ములుగు మండలం కాసిందేవి పేట నుండి సర్వాపూర్ గ్రామం వరకు ఎస్ఆర్ ఎస్పీ కాలువలు పునరుద్ధరించి సాగు నీరు అందించాలని కోరారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్కరికి పోడు పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారను. ప్రజా పోరాటాల ద్వారానే పోడు పట్టాలు వస్తున్నాయని అన్నారు. మంగపేట మండలం కమలపూర్ బిల్ట్ ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ ఫ్యాక్టరీపై ప్రత్యేకంగా పరోక్షంగా 20వేలమంది ఆధారపడి ఉన్నారని అఆన్నరు. ఇచ్చి మాట ప్రకారం బిల్ట్‌ను తెరిపించాలన్నారు. ఏటూరునాగారం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేయాలని అన్నారు. ఏటూరు నాగారం గానీ మంగపేట కేంద్రంగా గానీ ఇంజినీరింగ్ కళాశాల, గోవిందారావు పేట మండలం పస్రా కేంద్రంగా సమ్మక్క సారలమ్మ నర్సింగ్ కలశాల మంజూరు చేయాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం మల్లంపెల్లిని మండలంగా ప్రకటించాలన్నారు. లక్ష్మి దేవి పేట, రాజు పేట లను మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఉద్యమాలు చేస్తున్నారని, వీటిని కూడా మండలాలుగా ప్రకటించాలని కోరారు. ములుగుకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీ పనులు నేటికీ ప్రారంభించ లేదన్నారు. గిరిజన యూనివర్సిటీకి భూమి కేటాయించి 4 ఏండ్లు గడుస్తున్న ఇప్పటి వరకు అతి గతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలని గిరిజన యూనివర్సిటీ తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయం ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందినా అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. వెనుకబడిన మండలాలు కొత్తగూడ నూతనంగా ఏర్పాటు చేసిన గంగారాం, కన్నాయిగూడెం మండలాలకు విద్య వైద్యం అరకొరగా ఉన్నాయనీ, కొత్త గూడ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు 30 పడకల ఆసుపత్రిని నిర్మించాలని అన్నారు. కన్నాయిగూడెం, గంగారాం మండలాలలో ఇంటర్ కలశాలలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆక రాధాకష్ణ,మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా,వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నల్లెల భరత్ కుమార్,మాజీ సహకార సంఘం చైర్మన్ కునురీ అశోక్ గౌడ్, పట్టణ అధ్యక్షులు వంగ రవి యాదవ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షకీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మట్టేవాడ తిరుపతి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ మూసిన పెల్లి కుమార్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి సునేటి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పేరిట... నాసిరకం !



మోసపోతున్న వినియోగదారులు

నవతెలంగాణ-కాటారం

మనిషి నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునేంతవరకు నిత్యవసరాలను వినియోగిస్తూనే ఉంటాడు. ఈ క్రమంలో ప్రజల అవసరాలను అదునుగా చేసుకొని నాణ్యత పేరట ప్రజల నుండి వ్యాపారులు లక్షల రూపాయలు లాగిస్తున్నారు. వ్యాపారుల మోసాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అరికట్టాల్సిన సంబంధిత అధికారులు ఫిర్యాదు అందితేనే స్పందిస్తామనే తీరుగా వ్యవహరిస్తున్నారు. తూనికల కొలతల అధికారుల నిర్లక్ష్యపు వైఖరి ప్రజలకు నష్టంగా.. వ్యాపారులకు కాసుల పంటగా మారింది.

కాటారం మండల కేంద్రంలో సుమారు 5 సూపర్ మార్కెట్‌లు, 20 హోల్ సేల్ దుకాణాలు, 35 కిరాణా దుకాణాలు మండలం మొత్తం 300 దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులను వ్యాపా రులు ప్రజలకు అమ్ముతున్నారు. తునికల కొలతల శాఖ నిబంధనల ప్రకారం ఏదైనా ప్యాకేజ్ ద్వారా అమ్మే వస్తువులకు ఆ వస్తువు తయారీ సంస్థ పేరు, తయారు తేదీ, గడువు తేదీ, బరువు, వినియోగదారా సేవ కేంద్రం నెంబరు వివరాలు, తదితరాలు పొందుపరిచి ఉండాలి. కానీ మండల కేంద్రంలోని సూపర్ మార్కెట్ యజమానులు, దుకాణదారులు సిండికేట్‌గా మారి పప్పు దినుసులైన కంది, పెసరు, మినపప్పు, బబ్బర్లు, మక్కలు, జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు, సుగంధ ద్రవ్యాలు, చక్కెర, రవ్వ, ఛాయ పత్తిలను దేశ మహానగరాలలో అది చౌకగ వ్యాపారులు ఖరీదు చేసి వాటిని సూపర్ మార్కెట్‌లో జల్లెడ పట్టించి, ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేయించి నాణ్యత ప్రమాణాలు తుంగలో తొక్కుతున్నారు. నెంబర్ వన్ మాల్ అంటూ అధిక ధరలకు అమ్ముతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. నిరంతరం పర్యవేక్షించి మోసాలను నియంత్రించి, వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన శాఖ అధికారులు తమకు ఫిర్యాదు అందితేనే స్పందిస్తామనే రీతిలో వ్యవహరించడం గమనార్హం.

సదరు వ్యాపారులపై చర్యలు తీసీకోవాలి



నిబంధనలను బేఖాతర్ చేస్తూ నిత్యవసరాలలో నాణ్యత పేరట మోసాలకు పాల్పడుతున్న వ్యాపారుల దుకాణాలలో తనిఖీలు చేపట్టేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలి. సెకండ్ గ్రేడ్ మాల్‌ను సొంతగా ప్యాకేజీ చేసి అమ్ముతూ, మోసాలకు పాల్పడుతూ, లక్షలు దోచుకుంటున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

\- కేశిరి రాజు, తెలంగాణ ఎరుకల సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



సామాన్యుడిని పన్నులతో ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం వేతనాలు పొందుతున్నప్పటికీ పెట్టుబడి దారునికే కొమ్ము కాయడం దుర్మార్గపు చర్య. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లే వ్యాపారుల మో సాలపై నియంత్రణ లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోతే డివైఎఫ్ఐ అధ్వర్యంలో ప్రభుత్వం , అధికారులకు కనువిప్పు కలగజేస్తాం.

\- ఆత్కూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఆ.. సారు హింసించే 'పులకేసి' ?

మందు విందుతో మొదలు..

నిత్యావసరాలతో ముగింపు !

అధికారి తీరుతో మదనపడుతున్న

పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-మంగపేట

ప్రజలను నిత్యం తన చేష్టలతో హింసించే రాజును 'పులకేసి'గా డైరక్టరు ఓ సినిమాలో చూపించిన తీరు మనకు తెలిసిందే. అదే తీరుగా వ్యవహరిస్తూ నిత్యం తన, తన కుటుంబ అవసరాలను తీర్చాలంటూ మండలంలోని 25 గ్రామపంచాయతీల కార్యదర్శులను హింసిస్తున్న 'పులకేసి' ఈ అధికారి గురించి మనకు తెలియాల్సి ఉంది. 2021లో పంచాయతీరాజ్ డిపార్టుమెంట్‌లో మండల స్థాయి అధికారిగా చేరిన ఆయన మండలంలో స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేని అవకాశాన్ని అందిపుచ్చుకుని పంచాయతీ కార్యదర్శులను తన అవరాలు తీర్చాలంటూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ప్రొబెషనరీ పిరియడ్ విధుల్లో ఉన్న పంచాయతీకార్యదర్శులు పెద్ద సారు కోరికలు తీర్చలేక ఇతరులతో చెప్పుకోలేక సతమతమవుతున్నారు. వారంలో నాలుగైదు రోజులు విధుల్లో ఉండే సారు ఆ రోజు మందు, విందు ఖర్చులు ఆ కార్యదర్శితోనే పెట్టిస్తూ వేదింపులకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాక వచ్చిన రోజు మంగపేట నుండి జంగాలపల్లికి కారు కిరాయి తదిరాలు కూడా కార్యదర్శే భరించాలని హుకుం జారీ చేస్తాడు. ఇవి కాక ఇంటి అవసరాల కోసం చింతపండు, ఎండి మెరపకాయలు, మామిడి కాయలు, పల్లికాయలు, కందులు, పెసర్లు, బొబ్బర్లు, నచ్చిన కూరగాయలు సారు ఏది కోరితే అది ఇలా ఓ కుటుంబానికి కావల్సిన అన్ని అవసరాలను తీర్చమంటూ కార్యదర్శులను పిండిపిప్పిచేస్తున్నాడనే విమర్శలున్నాయి. ఈ విషయాలను కార్యదర్శులు బయటకు చెప్పుకోలేక రెండు, మూడు నెలలకు ఒక సారి వచ్చే తమ జీతాలతో సారు కోరికలు తీర్చలేక ఒకరితో ఒకరు చెప్పుకోని ఆవేదన చెందుతున్నట్లు మండలంలో గుస గుసలు వినిపిస్తున్నాయి. సారు మండల అధికారిగా ప్రతి నెల 33 వేల రూపాయలు తన స్వంత కారుపై అలవెన్సు ప్రభుత్వం నుండి తీసుకుంటూనే మండలంలో ఎక్కడా తన కారులో పర్యటనలు చేయక పోవడం విశేషం. మరో అధికారి కారులో మండలంలో తిరుగుతూ ప్రభుత్వానికి గండి కొడుతున్నాడనే ఆరోపణలున్నాయి. మంగపేట నుండి జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఉండే సారు కారులో పంచాయతీ కార్యదర్శులే పెట్రోల్/ డీజిల్ కొట్టించాలనే షరతులు కూడా పెట్టినట్లు చెప్పుకుంటున్నారు. సారుకు సరిపడా మందు, విందు ఏర్పాటు చేసి ఆ గ్రామంలో సకల మర్యాదలతో సాగనంపిరావాల్సి వస్తుందని కార్యదర్శులు నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. ఈ విషయంలో సారు మహిళా కార్యదర్శుల నుండి కూడా తన ఏజంట్లతో డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ విధుల్లో చేరే నాటికే సారు విడిది చేసే గ్రామంలో పేయింగ్ గెస్టుగా గడుపుతున్నాడని ఓ మహిళతో సహజీవనం చేస్తుండగా ఈ విషయం మహిళ బంధువులకు తెలిసి సారుకు దేహశుద్ధి చేయడంతో నెల రోజుల పాటు సెలవులు కూడా పెట్టినట్లు గుస గుసలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికైనా సారు తీరులో మార్పు వచ్చి పంచాయతీ కార్యదర్శులను 'హింసించడం' మానేస్తే వారు 'పులకిస్తారని' మండల ప్రజలు అంటున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం

• జిపి కార్మిక జెఏసీ కో కన్వీనర్ శ్రీకాంత్

నవతెలంగాణ-మల్హర్‌రావు

గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు ఈ నెల 21 లోపు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఏసి రాష్ట్ర కో కన్వీనర్ సాదుల శ్రీకాంత్ హెచ్చరించారు. మంగళవారం సమ్మెకు సంబంధించిన నోటీస్‌ను పంచాయతీ రాజ్ గ్రామీణాభివద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు అందజేసి ఆయన మాట్లాడారు. మల్టీ పర్పస్ విధానం రద్దు, కారొబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ జివో 60 తదితర డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. లేదంటే సమ్మె బాట పట్టడం ఖాయన్నారు. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ట్రెజర్ ద్వారా వేతనాలు ఇవ్వాలని,కనీస వేతనంగా రూ.19వెలు ఇవ్వాలని, కారొబార్ లను సహాయ కార్యదర్శులగా నియమించాలని,ఎస్ కెడే ఇన్సరెన్స్ పథకాన్ని రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కోటగుళ్ళ గోశాలకు దానా వితరణ

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాలకు గోదావరిఖని వాస్తవ్యులు మట్టి కవిత భూమేష్‌గౌడ్ దంపతులు దాన బస్తాలను అందజేశారు. గోశాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తామని వారన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేష్, కవిత, భూమేష్ దంపతులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గోశాలకు దాన బస్తాలను అందజేసిన దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన

నవతెలంగాణ-మల్హర్‌రావు

మూడేళ్ళు దాటిన చిన్నారులను అంగన్ వాడి కేంద్రాల్లో చేర్పించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మహాదేవ్‌పూర్ సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మల్లారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా మండల డూపర్ వేజర్ సరస్వతి హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం,అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి టీచర్లు, ఆయాలు, చిన్నారులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, సూపర్ వైజర్ మాట్లాడారు మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

మహాముత్తారం : మహాముత్తారం మండలంలోని ప్రేమ్‌నగర్, పెగడపల్లి, ఆంజనేయ పల్లి,అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం ఆరోగ్య సలహాలు సూచనలు తదితరాంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రమ్య బాయి, అంగన్వాడీ టీచర్ జాటోత్ చరణ్ బాయ్ తో పాటు పెగడపల్లి, ఆంజనేయ పల్లి అంగన్వాడీ టీచర్లు రజిత బాయి, అజ్మీర విజయ భాయి తదితరులు పాల్గొన్నారు.

మహాదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని పలుగులలో మంగళవారం సిడిపిఓ రాధిక ఆదేశాల మేరకు దశబ్ద ఉత్సవాల భాగంగా కిషోర్ బాలికలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. 1098 హెల్ప్ లైన్ నెంబర్ పై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్ల వద్ది ఉమామహేశ్వర్ మచ్చ శైలజ, ఆయాలు, బాలింతలు, గర్భిణిలు, కిషోర్ బాలికలువిద్యార్థులు పాల్గొన్నారు.



జీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ శిక్షణ

నవతెలంగాణ- గణపురం

మండలంలోని సీతారాంపురం, కొండాపురం, అప్పయ్యపల్లి గ్రామాల నిరుద్యోగ యువతకు మంగళవారం ఉచిత డ్రైవింగ్ శిక్షణను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పోలుసాని లక్ష్మీ నరసింహారావు, సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్ రెడ్డి, కొండాపూర్ ఎంపీటీసీ మంద అశోక్ రెడ్డి , అప్పయ్య పల్లి సర్పంచ్ ఐలోని శశిరేఖ రామచందర్ రెడ్డి సీతారాంపూర్ సర్పంచ్ రామంచ భద్రయ్య కొండాపూర్ సర్పంచ్ మామిడి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకొని ఉచిత లైసెన్స్ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు మోతే కరుణాకర్ రెడ్డి, మార్నేని ఉపేందర్‌రావు సీతారాంపూర్ గ్రామశాఖ అధ్యక్షులు వైనాల వెంకటేష్, ఉపాధ్యక్షులు శివరాత్రి గణేష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎలబోయిన భద్రయ్య, మంద రాజు , మాచర్ల రాజేష్ కన్న, కుంట రణధీర్, గంధం సుదర్శన్, మాటేటి రమేష్ మంద రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-రేగొండ



అన్నదాతలు మంచి దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలు అత్యంత ముఖ్యమైనవని ఎన్ఎస్ఎస్‌పి ప్రతినిధి ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని కొత్తపల్లిగోరి గ్రామ పంచాయితీ ఆవరణలో జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల సంస్థ వారు మిర్చి పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పంటల దిగుబడి పెరగాలంటే రైతులు కచ్చితంగా భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారులు ఇచ్చే భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తేనే రైతులు మంచి దిగుబడులు సాధిస్తారని తెలిపారు. పచ్చిరొట్ట, ఎరువులు, విత్తన శుద్ధి వలన కలిగే లాభల గురించి వివరించారు. రైతులు మిరప నారు మడులు ఏర్పాటు చేసుకున్నప్పుడు ఎత్తైన మడులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విత్తనశుద్ధికి షేడ్ నెట్ ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పసిడి పంటల సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, రఘు రేగొండ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు బట్టు శ్రీనివాస్, యాట రాజన్న రైతులు అప్పని చంద్రమౌళి, చిలుక చేరాలు, బొడకుంట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌కు ఉత్తమ మీసేవా అవార్డు

నవతెలంగాణ-వెంకటాపూర్




రాష్ట్ర ప్రభుత్వం 2022-23కుగాను ఉత్తమ మీ సేవా అవార్డును ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదాసు రంజిత్ అందుకున్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రంజిత్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ అవార్డును ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య అందజేశారు.

కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలి

• బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సూరపనేని సాయికుమార్

నవతెలంగాణ-గోవిందరావుపేట



ములుగులో బుధవారం జరిగే మంత్రి కేటీఆర్ పర్యటనను నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాయికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం లోని ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ప్రజా ప్రతి నిధులు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ బుధవారం ములుగు జిల్లాలో కేటీఆర్ పర్యటన సందర్భంగా గోవిందరావుపేట పార్టీ నుండి భారీ ఎత్తున తరలి వెళ్లడానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు కార్యకర్తలను సమీకరించి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి తుమ్మల హరిబాబు మండల ప్రధాన కార్యదర్శి నరసింహ, కో ఆప్షన్ సభ్యుడు ఎండి బాబర్‌తో పాటు మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, గ్రామ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ములుగు జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన

• రూఐ.150 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
• మంత్రి సత్యవతి రాథోడ్
• జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్



నవతెలంగాణ- ములుగు

నేడు ములుగు జిల్లాలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పర్యటన సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ నిర్విరామంగా మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం నుండి రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్వయంగా పలు మార్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెలిపాడ్, పక్కన నూతనంగా నిర్మిస్తున్న సమీకత కలెక్టరేట్ పనులను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా సభ నిర్వహణపై అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. పాలంపేట రామప్ప చెరువు వద్ద ఏర్పాట్లను మంత్రి పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ములుగు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... ములుగు జిల్లాలో పలు అభివద్ధి కార్యక్రమాలతో పాటు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడానికి విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్‌కు జిల్లా ప్రజలందరి తరఫున స్వాగతం తెలియజేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ములుగు జిల్లా ఏర్పాటుతో ఇక్కడ దినదిన అభివద్ధి జరుగుతుందని, కేటీఆర్ రాక కోసం మీ జిల్లా ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని, రూ.150 కోట్లతో అభివద్ధి పనులు, 200 కోట్లతో లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేయనున్నారని తెలిపారు. ములుగు జిల్లాలో ఆర్టీవో సేవలను రేపటి నుండి ప్రారంభించుకోబోతున్నాయని, షెడ్యూల్ ప్రకారం నేటి ఉదయం 9 గంటల 30 నిమిషాలకు బేగంపేట నుండి కేటీఆర్ బయలుదేరుతారన్నారు. 10:15 నిమిషాలకు ములుగు గవర్నమెంట్ డిగ్రీ కాలేజికి మంత్రి కేటీఆర్, హొం మంత్రి మహమ్మద్ అలీ చేరుకుంటారని అన్నారు. రామప్పలో అదే రోజు ఇరిగేషన్ డే గోదావరి జలాలకు పూజలు చేయనున్నారని తెలిపారు. రామప్ప రిజర్వాయర్ పూర్త యినా నేపథ్యంలో ఇరిగేషన్ చెరువుల ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కషితో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు దక్కిన రామప్ప ఆలయంలో మంత్రి కేటీఆర్ గారు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ములుగు జిల్లా కేంద్రం లోని సాధన హై స్కూల్ పక్కన ప్రాంగణంలో బహిరంగ సభలో ఐకెపి మహిళలకు వడ్డీ లేని రుణాలు చెక్కుల పంపిణీతో పాటు గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ 125 యూనిట్లు పంపిణీ చేయనున్నారన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలని, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం పని చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, ఎంపీపీ శ్రీదేవి జెడ్పిటిసి భవాని, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంబరాలే కాదు... సాగునీటి ఇబ్బందులు తీర్చాలి

• మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ - కాటారం



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాగునీటి సంబరాలు చేసుకోవడం సరి కాదని, రైతాంగం కష్టాలను తీర్చాలని, చెరువులకు మరమ్మతులు చేపట్టాలని మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని వీరాపూర్, ఒడిపిలవంచ ,శివశంకర్ ప్రాజెక్టులను సందర్శించారు. రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి సంబరాల పేరుతో కాలయాపన చేయడం తగదని హితవు పలికారు. మంథని నియోజకవర్గం లోని కాటారం, పలిమేల, మహా ముత్తారం, మల్హర్ మండలాలలో అనేక చెరువులు గండ్లు పడి మరమ్మతుకు నోచుకోకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగానికి, రాష్ట్ర మంత్రివర్గానికి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన చలనం లేదన్నారు. గడిచిన సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు గండ్లుపడిన చెరువులకు నేటికీ మరమ్మతులు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఎందుకు చేపట్ట లేదని ప్రశ్నించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చేపట్టి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నారం బ్యారేజ్ వద్దకు మంత్రులు రావడం సంతోషమే అయినప్పటికీ సాగు నీటి ప్రాజెక్టుల పేరుతో సంబరాలు చేసుకోవడం వల్ల ఈ ప్రాంతానికి ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. బ్యారేజ్ బ్యాక్ వాటర్ వల్ల సుమారు 400 నుండి 500 ఎకరాల నష్టం వాటిల్లుతుందని నష్టపోయిన రైతులకు శాశ్వత పరిష్కారం అందించాలని పేర్కొన్నారు. శ్రీధర్ బాబు వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు గౌడ్, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, సర్పంచులు కోడి రవి, వేము నూరి రమేష్ రెడ్డి, ఆత్మకూరి రాజయ్య యాదవ్, యూత్ అధ్యక్షులు చీమల సందీప్, చీర తిరుపతి, కంకణాల రఘు, రైతు సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

తాడిచెర్లలో వింత ఘటన ?

• ఇంట్లో మంటలు....
• భయాందోళనలో కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండల కేంద్రమైన తాడిచెర్లలో వింత ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మందపెల్లి పోచయ్య ఇంట్లో గత నాలుగైదు రోజులుగా అనుమాస్పదంగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. గత గురువారం నుంచి మంగళవారం వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల ప్రాతంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగుతూ ఇంట్లో వస్తువులు రోజుకోకటి కాలిపోతున్నాయని, ఈ వింత ఘటన మిస్టరీగా మారిందని పోచయ్య తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు.ఇప్పటికే ఇంట్లో బెడ్ పై ఉన్న పక్క బట్టలు, పరుపులు, ఇంటి ముందు ఉన్న ఎండు గడ్డి, ఒక బస్తాలో ఉన్న కొబ్బరి పిసు,రోజుకో వస్తువు అకస్మాత్తుగా మంటలు చెలరేగి కాలిపోవడంతో వింతను చూడడానికి గ్రామస్తులు వందలాదిమంది తరలివస్తున్నారు.ఈ ఘటనపై రెవెన్యూ, పోలిస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఓపెన్ కాస్ట్ గని సమీపంలో ఉండడం ద్వారా బ్లాస్టింగ్ చేసే సమయంలో విష వాయువులు ప్రబలి జరగవచ్చని కొందరు, చేతబడి జరిగిందని, మరికొందరు అనడంతో ఇంట్లో ఉన్నవాళ్లు ఇంకా భయాందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనా జన విజ్ఞాన వేదిక, సంబంధిత అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శంచి బాధితులకు ధైర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-మంగపేట

మండల కేంద్రం టీచర్స్ కాలనీకి చెందిన పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థి అక్కినపెల్లి వెంకట శ్రీరాం(19) మంగళవారం ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి అక్కినపెల్లి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు వెంకట శ్రీరాం భూపాలపల్లి జిల్లా కాటారంలో పాలిటెక్నిక్ పూర్తి చేసి బీటెక్ ఎంట్రన్స్ రాసి రిజల్ట్ కొరకు ఎదురుచూస్తున్నాడు. పాలిటెక్నిక్ చదువున్న తరుణంలో కాలేజీలో ఓ అమ్మాయితో ఏడాదిగా పరిచయం ఉన్నట్లు తండ్రికి తెలిపాడు. మైనర్ కావడంతో మేజర్ అయ్యే వరకు వేచి ఉండాలని చెప్పాడు. అయితే ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు వెంకటేశ్వర్లు రోదిస్తూ తెలిపారు. పోలీసులు పంచనామా చేసి ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నెల 8 నుంచి 10 వరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

• జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ - ములుగు



జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈ నెల 8 నుండి 10 వరకు ఇర్వహించే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య పిలుపునిచ్చారు. మంగళ వారం కలెక్టర్ ఛాంబర్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించి కలెక్టర్ మాట్లాడారు. 8న ఊరూరా చెరువుల పండుగలో మత్స్యకారులందరూ పెద్ద సంఖ్యలో వలలు, సంప్రదాయ చేపల బుట్టిలతో పాల్గొని విజయవంతం చేయాల్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కవులు, రచయితలు, సాహితివేత్తలకు ఈనెల 11న కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాయంత్రం 5గంటలకు ప్రారంభం అవుతుందని తెలంగాణ సాహిత్య దినోత్సవం వేడుకలలో భాగంగా తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీ భాషలలో కవి సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈకార్యక్రమంలో పాలొనే కవులు, రచయితలు, సాహితివేత్తలు తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితా సంకలనం ఉండాలని అన్నారు. పేరు నమోదు చేసుకునే వారు వారి కవితా సంపుటి 20 వరుసలకు మించకుండా డిటిపి ప్రింట్ తీసి వ్యక్తిగత వివరాలను తెలియజేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డికి సమర్పించాలని అన్నారు. ఆ కవితలు ఏ పత్రికలో గాని ఇతరత్రా మాధ్యమాల్లో గాని గతం లో ప్రచురించబడలేదని స్వయంగా ధ్రువీకరించాలని పేర్కొన్నారు. 8న సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని, తదుపరి వచ్చిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోనబడవని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం బద్దం సుదర్శన్ రెడ్డి 9603672289ని సంప్రదించాలని తెలిపారు.



నిరాశ్రయులకు ఆసరాగా నిలిచిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

నవతెలంగాణ - ములుగు

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆసరాగా నిలిచారు.వెంకటాపూర్ మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్లపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన మడికొండ రమేష్ ఇల్లు విద్యుత్ ఘాతంతో పూర్తిగా కాలిపోయి నేలమట్టమయింది. దీంతో ఆ కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలింది. విషయం తెలుసుకున్న తస్లీమా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందించారు. సర్వర్ చారిటబుల్ ట్రస్టు,ఫౌండేషన్ సభ్యులు స్థానికులు ఉన్నారు.

రైతుల ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలి

• తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు గుండు రామస్వామి

నవతెలంగాణ-గోవిందరావుపేట



ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతుల ధాన్యం డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం ములుగు జిల్లా నాయకులు గుండు రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామస్వామి మాట్లాడారు. రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి 30 రోజుల నుండి 45 రోజులు వ్యవధి కావస్తున్న రైతుల ఖాతాల్లో దాన్యం డబ్బులు జమ కాలేదన్నారు. రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం అధికారుల తమ వైఖరి మార్చుకోవాలని అన్నారు. ములుగు జిల్లాలో లక్షల క్వింటాళ్ల ధాన్యం పండితే కేవలం ఐదు మిల్లులకే తోలకం పరిమితం చేయడం వల్ల కాంటా వేసిన ధాన్యాన్ని తరలించేందుకు 20 నుండి 30 రోజులు రైతులకు పట్టిందన్నారు. ధాన్యం కాంట వేసిన తరలించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే అదనుగా ప్రతి 40 కిలోల ధాన్యం బస్తాకు రైతు పది రూపాయలు చెల్లించిత లోడ్ వేసుకుంటామని దోపిడీ చేస్తున్నారని అన్నారు. మరోపక్క మిల్లు యాజమాన్యం క్వింటాకు 10 కిలోల వరకు కోతవిధిస్తూ దోపిడీ చేస్తున్నారని అన్నారు. పాలకులు, అధికారులు స్పందించి సకాలంలో ధాన్యం డబ్బులు ఖాతాలు జమ అయ్యేలా చర్యలు తీ సుకోవాలని అన్నారు. లేదంటే ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు నిమ్మల బిక్షం, దేవి పాల్, కూన వెంకన్న, గుండు లెనిన్, రాజ్ కుమార్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



బడిబాట తీరును రాష్ట్ర పరిశీలకుల పరిశీలన

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల కేంద్రంలో సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలలో బడిబాట తీరును రాష్ట్ర పరిశీలకులు సరోజినీ దేవి, మోడల్ స్కూల్స్ డైరెక్టర్, సీఎంవో కిషన్ రావు పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రజలకు తెలియజేస్తూ అత్యధికంగా ప్రవేశాలు కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం అశోక్, కాంప్లెక్స్ పరిధి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

• డీసీఈబీ కార్యదర్శి ఎ విజయమ్మ

నవతెలంగాణ - ములుగు

ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు వారి పిల్లలని చేర్పించాలని డిసిఈబి కార్యదర్శి ఎ విజయమ్మ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రధానోపాధ్యాయురాలు ఎ విజయమ్మ, ఉపాధ్యాయ బృందంతో కలిసి ములుగులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు మనబడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించారని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వార పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరారు. ఉపాధ్యాయులు చంద్రమౌళి, శారద, సిఎస్ఐ పాఠశాల ఉపాధ్యాయులు బలరాం, రమేష్, వార్డు సభ్యులు సయ్యద్ ఆసియా, సిఆర్పి చల్ల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ -మహాముత్తారం

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు జాటోత్ రాంసింగ్ అన్నారు. మంగళవారం మహాముత్తారం మండలం లోని బోర్లగూడెం ఎంపీ యుపిఎస్ పాఠశాల పరిధి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల భాగంగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జాటోత్ రామ్ సింగ్ మాట్లాడుతూ.. పాఠశాలను కొత్త హంగులతో పాఠశాలను తీర్చిదిద్దామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. సింగారం, స్తంభంపల్లి పీకే, రేకులగూడెం, పోచంపల్లి ఇతరత్ర గ్రామాల నుండి ఉన్నత విద్యనభ్యసించేందుకు వచ్చు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సహకారంతో ఉచిత బస్ పాస్ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్, నవీన, షాజహా, మౌనిక, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి

• హెచ్‌ఎం సుతారి రమేష్

నవతెలంగాణ- తాడ్వాయి

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బాలుర ఆశ్రమ పాఠశాల కొడిశెల హెచ్‌ఎం సుతారి రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని బంధాల, కోడిశెల, లింగాల, బొడ్డుగూడెం గ్రామాల్లో విద్యార్థులకు తల్లిదండ్రులకు 'బడిబాట' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిశెల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సుతారి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి ఫీజులు, రుసుములు లేకుండా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ లు, పౌష్టికాహారం ఏకరూప దుస్తులు అందిస్తామని అన్నారు. కొడిశెల ఆశ్రమ పాఠశాలలో గత పది సంవత్సరాల నుండి రిజల్టు మండల టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు. అందరూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు రవీందర్ సుధాకర్ శేషగిరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



శభాష్ రవి....

• కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

నవతెలంగాణ-వెంకటాపురం

చిన్నతనం నుంచి అతనికి రెండుకాళ్ళు పనిచేయవు. ఒక వ్యక్తి తోడుగా లేకుంటే ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. తాను వైకల్యం లేని వారితో పోటీ పడాలని అనుకున్నాడు. బతుకు దేరువు కోసం మండల కేంద్రంలో మీసేవ కేంద్రం నిర్వహించుకుంటూనే ఉన్నత చదువులో రాణించాలని అనుకుని ఎల్ఎల్‌బి పట్టా పొందాడు. అతని ఆశయం ముందు అంగవైకల్యం ఓడి పోయేలా చేసుకున్నాడు. ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుని శభాష్ అనిపించుకున్నాడు చిడెం రవికుమార్. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏజన్సీ రూరల్ ఏరియాలో మీసేవ నిర్వాహకుల సన్మాన కార్యక్రంలో భాగంగా మండల కేంద్రంలో మీసేవ నిర్వాహకులు చిడెం రవికుమార్ ను సన్మానించారు. మండలం లో సూపరిచితుడ ,భూసమస్యలపై మీసేవ కేంద్రానికి వచ్చే రైతులకు తన వంతుగా సలహాలు ఇస్తూ వివిధ దరఖాస్తులపై వచ్చిన గ్రామస్తులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తున్న రవికి ఉత్తమ పురస్కారం దక్కడంతో పలువురు అభినందించారు.

కొత్త మెనూకు అనుగుణంగా రేట్లు పెంచాలి

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వి దిలీప్

నవతెలంగాణ- ములుగు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన,ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, నూతన మెనూ ప్రకారం నూతన రేట్లు ప్రకటించకుండా పాత రేట్లతోనే కొత్త మెనూ అమలు చేయాలని అనుకోవడం సరికాదని టిపిటిఎఫ్ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు వి దిలీప్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వంట బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడంతో పౌష్టికాహారం అందివ్వడం అనేది కాగితాల పై చూపించుకొడానికేనన్నారు. నూతన మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడ్డానికి అవసరమైన రాగుల పిండి ,బెల్లం, సాయంత్రం స్నాక్స్ తదితర వస్తువులు పాఠశాలలకు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైతం సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

చేనేత కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-శాయంపేట

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మడికొండలోని ఐటిపార్క్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతిఉత్సవంలో శాయంపేటలోని చేనేత సొసైటీలో పనిచేస్తున్న చేనేత కార్మికుడు బాసాని నవీన్‌ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ ను ఏడి రాధికా రెడ్డి, డివో వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మామిడి శంకర్ లింగం, పాలకవర్గ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, బాసాని సాంబయ్య, దాసరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, మెండు సమ్మక్క, బాసాని పద్మ, తోటి కార్మికులు అభినందించారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-వరంగల్

షెడ్యూల్ కులాల వరంగల్ జిల్లా ద్వారా నిర్వహించబడుతున్న కార్పొరేట్ కళాశాలలో చదివేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 11 లోపు దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్ కుల అభివృద్ధి వరంగల్ జిల్లా అధికారి భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఎయిడ్ ఎడ్, ప్రభుత్వ వసతి గృహం, గురుకులాలు, కేంద్రీయ, నవోదయ, కేజీబీవీ లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులు, వారు 2023 మార్చిలో పదవ తరగతి ఉత్తీర్ణులైన 400 మార్కులకు సమానమగు 7.0 గ్రేడ్ ఆపై వచ్చిన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మైనారిటీ విద్యార్థులు www.telangana.epass.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంను సంప్రదించి వారి వివరాలు నమోదు చేసుకోవాలని, ఎస్ఎస్‌సీ ధ్రువపత్రము, కులం, ఆదాయం, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, వికలాంగులైన సంబంధించిన అధికారి ధ్రువపత్రం, వసతి గృహం అయితే సంక్షేమ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ధ్రువపత్రం సమర్పించాలని ఆమె కోరారు.

ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



నవతెలంగాణ-శాయంపేట

కొత్తగూడెంలో ఈనెల 11న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభకు కార్మికులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దకొడపాక రెవెన్యూ శివారు సర్వేనెంబర్ 633లో గుడిసెవాసుల సమక్షంలో మంగళవారం ప్రజాగర్జన బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను బిక్షపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న జరగవలసిన సభ అనివార్య కారణాలవల్ల జూన్ 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా కొత్తమైన్స్ కోసం పోరాటం, సొంతఇంటి సౌకర్యం, నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని, విభజన హామీల అమలు, బయ్యారం ఒక కర్మాగారం, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఉద్యోగాల భర్తీ, రైతు రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, అర్హులైన వారికి దళిత బంధు, ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ వర్గాలకు రావాల్సిన నిధులు, కొత్త రేషన్ కార్డులు అనేక సమస్యలపై ప్రజలను చైతన్య పరచడానికి బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వ నెరవేర్చాలని, లేనియెడల రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి తోట బిక్షపతి, మండల నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, మారపల్లి క్రాంతికుమార్, రమాదేవి, రాజమణి, గుడిసె వాసులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు నుండి పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-కాజీపేట

రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాజీపేట జీఆర్పీ ఎస్సై చింత పరశురాములు తెలిపిన వివరాల మేరకు ఈనెల 2నఉదయం 4 గంటల కంటే ముందు నష్కల్ రైల్వే స్టేషన్ యాడ్ వద్ద గుర్తు తెలియని రైలునుండి వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి బలమైన గాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్ లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారని తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరచడం జరిగిందన్నారు. మృతుని కుటుంబ సభ్యులు బంధువులు ఎవరైనా ఉంటే కాజీపేట జీఆర్పీ పోలీసులను 9866330256, 9493201968 లకు సంప్రదించాలని తెలిపారు.

2కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పర్వతగిరి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 12 న తెలంగాణ రన్ 2023 వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద నిర్వహించడం జరుగుతుందని ఔత్సాహికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలనిఎస్సై డి.దేవేందర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రన్ 2 కిలోమీటర్లు ఉంటుందని కార్యక్రమంలో పాల్గొనేవారు 9908525276 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-శాయంపేట

బంగారు దుకాణంలో పనిచేస్తున్న గోరంటల కిరణ్ (28) విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తు న్న ఇసుకలారీ ఢీకొనడంతోఅక్కడికక్కడే మరణించాడు. కిరణ్ మృతితో శాయంపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం శాయంపేటకు చెందిన గోరంట్ల మల్లేశం, శోభ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తల్లిదండ్రులు మరణించడంతో కుమారులు జీవనోపాధికి వ్యాపారం చేసుకుంటున్నారు. రెండో కుమారుడైన కిరణ్ వరంగల్ పట్టణంలోని బంగారం దు కాణంలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే పనులు ముగించుకొని సోమవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై శాయంపేటకు వస్తుండగా దామెర మండలం ఊరుగొండ గ్రామశివారులోని పెట్రోల్‌బంకు వద్ద ఎన్‌హెచ్ 163 హైవే రోడ్డుపై ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. కిరణ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మంగళవారం ఎంజీఎం మార్చురీ వద్దకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కిరణ్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పారిశ్రామిక ప్రగతి అవార్డు అందుకున్న సోని బాబు



నవతెలంగాణ-కాశిబుగ్గ

తెలంగాణరాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన పెండ్యాల సోనిబాబు పారిశ్రామిక ప్రగతి అవార్డుతోపాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా సోనీ బాబు మాట్లాడుతూ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ నాలాంటి ఎంతోమంది యువతను పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన దళితబంధు ద్వారా తాను సోనుటైల్స్ అండ్‌సానిటరీ షాప్ పెట్టుకొని తన కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి కేటీఆర్ కృషి వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. తనను గుర్తించి అవార్డుఅందజేసిన ఎమ్మెల్యే నరేందర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలకు సోనుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ముళ్ల చెట్ల తొలగింపు

నవతెలంగాణ-కాజీపేట

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46 డివిజన్ పరిధిలోని రాంపూర్ గ్రామంలో స్థానిక చెరువు కట్ట వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా కంప చెట్లు దట్టంగా పెరిగి వాహనదారులకు ప్రమాదాలకు నిలయంగా ఉండడంతో మంగళవారం స్థానిక చెరువు కట్టపై ఉన్న కంప చెట్లను స్థానిక కార్పొరేటర్ మునిగల సరోజన కరుణాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మారగోని రవి, దేశిని హనుమంతరావు, తకలపల్లి దేవేందర్, కడరి కుమార్ ,రామారావ్, రాజు ,ఏమి ,మదశి వెంకటయ్య ,బాబు తదితరులు పాల్గొన్నారు.

మంటలు ఆర్పేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు



ఫైర్ ఇంజన్, నీటి ట్యాంక్‌లు తక్షణమే ఏర్పాటు
బయో మైనింగ్ నిర్దిష్ట లక్ష్యాన్ని వేగవంతంగా పూర్తిచేయాలి
రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో కొనసాగుతున్న
బయో మైనింగ్ ప్రక్రియ క్షేత్ర స్థాయి పరిశీలన....

నవతెలంగాణ-కాజీపేట

వేసవి తీవ్రత పెరగడంతో డంపింగ్ యార్డ్‌లో కాలుతున్న చెత్తను ఆర్పుటకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. బల్దియా పరిధిలోని 45వ డివిజన్ రాంపూర్ మడికొండలోని డంపింగ్ యార్డ్‌లో తీవ్రమైన ఎండకు కాలుతున్న చెత్త ను పరిశీలించి చెత్త ఆర్పుటకు తక్షణమే ఫైర్ ఇంజన్‌తోపాటు నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండతీవ్రత పెరగడంతో డంపింగ్ యార్డ్‌లో చెత్త కాలుతుందని, అధికంగా పొగ వస్తుండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా డంపింగ్ యార్డును సందర్శించి చర్యలుచేపట్టాలని ఆదేశించారు. బయోమైనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు పలు సూచనలు జారీ చేయడం జరిగింది. బయో మైనింగ్ ద్వారా చెత్తా నిర్వీర్యం చేస్తున్న తీరును కంప్యూటర్ లో రికార్డులను పరిశీలించి, డంప్ యార్డ్ లో 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిర్వీర్యం చేయాల్సిన లక్ష్యం కాగా ఇప్పటివరకు లక్షన్నర మెట్రిక్ టన్నుల చెత్త బయోమైనింగ్ ద్వారా నిర్వీర్యం చేయడం జరిగిందని, లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే జులై నాటికి పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసే లా వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతిరోజు 1600 మెట్రిక్ టన్నుల చెత్త ప్రాసెసింగ్ జరుగుతున్నదని, షిఫ్టలను, మెన్‌అండ్ మెటీరియల్ పెంచి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. చెత్త బయోమైనింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండ కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. వెలుబడిన అంత్య ఉత్పన్నాలను, ఆర్డీఎఫ్‌లను సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపడంతో పాటు వ్యవసాయశాఖ ద్వారా పొలాల్లో ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించడం జరిగింది అన్నారు. వారితో పాటుగా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఆర్ఎఫ్ఓ పాపయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈ సంజయ్, ఏఈ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్ లు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ అధ్యాపకులు లేక అస్థిత్వాన్ని కోల్పోతున్న యూనివర్శిటీలు

వర్శిటీ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయవచ్చు
కేయూ పూర్వ ఉపకులపతి ఆచార్య లింగమూర్తి



నవతెలంగాణ-కేయూ క్యాంపస్

విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపక నియామకాలు లేక పోవడంతో యూనివర్శిటీలు అస్థిత్వాన్ని కోల్పోతున్నాయని కేయూమాజీ వీసీ ఆచార్య ఎన్.లింగమూర్తి అన్నారు.కాకతీయ విశ్వ విద్యాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్రంలోని వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.లింగమూర్తి హాజరై ప్రసంగించారు. యూనివర్సిటీలు రెగ్యులర్ అధ్యాపకులు లేక తన అస్తిత్వాన్ని కోల్పోతున్నాయని, ఈ పరిస్థితులలో చాలా సంవత్సరాల నుండి యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా బోధన చేస్తున్న అధ్యాపకులు అందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తే వర్సిటీలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. ప్రభుత్వం యూనివర్సిటీ విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయాలని అనుకుంటే మొదటగా కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని తర్వాత నోటిఫికేషన్ ద్వారా మిగిలిన పోస్టులను నింపుకోవడానికి ఏ అడ్డంకులు ఉండవని సూచించారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ యూనివర్సిటీలు నడవాలంటే తక్షణమే యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి అన్నారు. వర్సిటీలకు స్వయం ప్రతిపత్తి ఉంది కాబట్టి వారి సర్వీసును గుర్తించి, రెగ్యులరైజ్ చేయడము సాధ్యమని అన్నారు. అర్హతలు ఉన్న ప్రతి ఒప్పంద అధ్యాపకుడికి వెంటనే గైడ్ షిప్ ఇచ్చి యూనివర్సిటీలను పరిశోధన వైపు మళ్లించి 'న్యాక్'లో మంచి గ్రేడ్ వచ్చే విధంగా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యా మండలి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు.

అదేవిధంగా ప్రతి డిపార్ట్‌మెంటులో కాంట్రాక్ట్ అ ధ్యాపకులకు విభాగాధిపతి బిఓఎస్, డీన్స్‌గా కూడా అవకాశాలుఇవ్వాలని, అవసరమున్న చోట అడ్మినిస్ట్రేటివ్ పొజిషన్స్ ఇచ్చి వర్సిటీల అభివృద్ధికి వారిని పాలుపంచుకునే విధంగా వర్సిటీలు ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయలలో పనిచేస్తున్న 1335 మందిని రెగ్యులరైజ్ చేయాలని, వర్సిటీలు కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులచే నడుస్తున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాంటాక్ట్ అసోసియేషన్ బాధ్యులు ఆర్.డి.ప్రసాద్, నాగయ్య, చందూలాల్, రవి, మధుశ్రీ,కష్టయ్య, అనిల్, శ్రీదేవి, రాధిక, కవిత, బిక్షపతి, మల్లేష్, విజయ్, రాజేశ్వరి,అరవింద్, గోపి, అనీఫ, శ్రీనివాస్, విజయ్, కల్పన, ఉషా, మధుకర్ రావు, దయాకర్, శ్రీధర్‌రావు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి



నవతెలంగాణ-హన్మకొండ

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్రమధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా తోటబిక్షపతి మాట్లాడుతూ నెలల తరబడి పాఠశాలల్లో విద్యార్థులకు వంటవండి పెడుతున్న మధ్యాహ్నభోజన కార్మికులకు విద్యాశాఖ బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని కానీ ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే ఇస్తూ మిగితా వంట సామాగ్రి, వంటచెరుకు, కూరగాయలు, పప్పు, కోడిగుడ్లు మాత్రం వంటవండే మహిళలే పెట్టుబడులు పెట్టి విద్యార్థులకు వండిపెట్టడం వలన మహిళా కార్మికులు అప్పుల ఊబిలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదనవ్యక్తంచేశారు. మరోవైపు నిత్యావసర సరుకులు, కోడిగుడ్లధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో మధ్యాహ్న భోజన కార్మికులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు ఏవిధంగానైతే కోడిగుడ్లు సరఫరా చేస్తుందో అదేరీతిలో ప్రభుత్వ పాఠశాలలకు కూడా కోడిగుడ్లను పంపిణీ చేయాలన్నారు.వంటకార్మికులకురూ. 1000 నుండి రూ.3 వేలకు గౌరవ వేతనం పెంచి ఇస్తున్నట్టు స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటన చేశారని కానీ అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు.తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఉచితంగా వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు, వంట కార్మికులకు కనీసవేతను రూ. 26 వేలుఇవ్వాలని, కులాల వారీగా బిల్లులు ఇవ్వకుండా ఒకేమాదిరిగా,ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దెలమల్లేష్, శంకర్, ఐలయ్య, రాజేందర్,గడ్డం లలిత, సువర్ణలు పాల్గొన్నారు.

శ్రమను దోచుకుంటున్నా... పట్టించుకోని అధికారులు

మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ధర్నా, రాస్తారోకో



నవతెలంగాణ-ఆత్మకూర్

ఎండనక వానఅనక ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు పోతే డబ్బులు ఇస్తేనే కాంటాలు పెడుతున్నారు అంటు రైతులు నీరుకుల్ల ప్రధాన రహదారి పై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం ఆత్మకూరు మండలం పెంచికలపేట సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో వారి ధాన్యం నిల్వలు పేరుకపోతున్నాయి. నెల రోజులు గడిసిన కాంట వేయకుండా కొనుగోలు సెంటర్లో నిర్వాహకులు 40 కిలోల బస్తాకు రూ.31 లు వసూళ్లతోపటు అదనంగా లారీకి రూ.500లు చొప్పున వసూళ్లు చేస్తున్నారని రైతులు నిరసిస్తూ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్ రావాలి... దోపిడీని అరికట్టాలని అంటూ రైతులు నినాదాలు చేసారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు అడుగు అడుగున అన్యాయం జరుగుతుందని మహిళ రైతులు ప్రభుత్వంపై మండి పడ్డారు.

ధర్నా అనంతరం తెలంగాణ ఉద్యమ కారుడు వంగేటి ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు తీరనిఅన్యాయం చేస్తున్నారని కొనుగోలు సెంటర్‌కు నెలరోజుల క్రితం తీసుకొచ్చిన ధాన్యంను నేటివరకు కాంటా వేయకపోవడం వెనుకున్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేవలం పలుకుబడి ఉన్నవారికి, డబ్బులు ఇచ్చిన వారికి వెంటనే కాంటా పెడుతున్నారని నెలరోజుల నుండి ఇల్లును మరిచి వారి ధాన్యం వద్దనే రైతులు కాపలా ఉంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

రైతుల సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లాకలెక్టర్ ఐన స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలను కాంటాలు వేసి లారీల ద్వారా తరలించాలని కలెక్టర్‌ను కోరారు. ఇటీవలే కురిసిన వర్షానికి తడిసిన వరి,మొక్కజొన్న ధాన్యమును మద్దతు ధరకు కొనుగోలు చేయలని డిమాండ్ చేసారు. లేనిచోరైతులతో కలిసి ఆందోళన చేస్తామని అయన హెచ్చరించారు.మహిళా రైతు పత్తిపాక కొమురమ్మ మాట్లాడుతూ తిండితిప్పలు లేక ఆరోగ్యం దెబ్బతింటున్నా కూడా ఇక్కడనే ఉంటున్నామని మాకు న్యాయం జరిగేది ఎప్పుడని అన్నారు. వర్డ్ మెంబర్ పోతరాజు ఈశ్వర్, చిట్టిబొమ్మలా రవీందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'నవతెలంగాణ' పుస్తక ప్రదర్శన కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

జిల్లా గ్రంథాలయ సంస్థ నందు 'నవతెలంగాణ' బుక్స్ పబ్లికేషన్ వారి ఆధ్వర్యంలో 'నవతెలంగాణ' పుస్తక ప్రద ర్శన కేంద్రాన్ని జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాల యం పాఠకులకు నూతన పబ్లికేషన్ పుస్త కాలు, వివిధ గ్రంథ రచయితల నవలలు, పోటీ పరీక్షలు సన్నద్ధం అయ్యే నిరు ద్యోగులకు, చదువరులందరికి బుక్స్‌ను ఈ 'నవతెలంగాణ' పబ్లికేషన్ వారు ఈ మన గ్రంథాలయం ఎగ్జిబిషన్‌లో అందుబాటులో కి తీసుకురా వటం జరిగినది అని ప్రతి ఒక్కరు తప్పకుండ ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు నయీమ్మదిన్, నవతెలంగాణ బుక్ హౌస్ మేనేజర్ బండారి బాబు, మాజీ కార్పొరేటర్ మేడకట్ల సారంగపాణి , డిప్యూటీ లైబ్రరియన్ కరుణ కుమారి , గ్రేడ్ - 3 లైబ్రరియన్ పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ కుమారు, కుమారస్వామి , మమత, రాజేష్, గ్రంథ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి : డీవైఎఫ్ఐ



నవతెలంగాణ-హనుమకొండ

విద్యను వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విద్యా పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి దొగ్గేల తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి జిల్లా విద్యా శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే, అడ్మిషన్ల పేరుతో అందినంత దోచుకుంటున్నాయని ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, అడ్మిషన్, రిజిస్ట్రేషన్ టర్మ్ ట్యూషన్, పాఠ్యపుస్తకాలు నోటుపుస్తకాలు, యూనిఫామ్ లాంటి రకరకాల పద్ధతుల్లో ఫీజులు వసూలు చేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అయినా ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు స్కూల్ యజమాన్యాలు రెచ్చిపోతున్నాయని పాఠశాలల్లో ఎలాంటిపాఠ్యపుస్తకాలు స్టేషనరీ అమ్మకూడదని, ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా ప్రైవేట్ పాఠశాలలో ఇవేమీ పా టించడం లేదని ఆరోపించారు. బయట దుకాణాల కంటే పాఠశాలలో అధిక రేట్ల తో విక్రయాలు చేస్తూ సామాన్యుడికి విద్యను అందుబాటులో లేకుండా సంతలో సరుకులాగా మారుస్తున్న ప్రైవేటుస్కూళ్లపైచర్యలుతీసుకోవాలనిడిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం
రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-వేలేరు

భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామన్న ఐలయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రం వేలేరులో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన కార్మికులకు అందడం లేదని అన్నారు. కొంతమంది దళారుల సహాయంతో నకిలీ లేబర్ కార్డులు తయారుచేసి కార్మికులకు అందే సంక్షేమ ఫలాలతో లబ్ధి పొందుతున్నారని అన్నారు. దళారుల వల్ల నిజమైన భవననిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణ కార్మికుల సంఘం సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు . భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర మహాసభలకు కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు పంకెర్ల కుమారస్వామి, వేములకొండ సంపత్, తాటికొండ మధు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అజీద్, జిల్లా కోశాధికారి అంకం రావు , జిల్లా ప్రచార కార్యదర్శి దేవరుప్పుల బిక్షపతి పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ఖానాపురం

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం జరిగే ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజినల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. చెరువుల సమీపంలో బతుకమ్మలు వేసే స్థలాలలో పంచాయతీ సిబ్బందితో పరిశుభ్రం చేపించాలన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు గ్రామాల ప్రజలతో ర్యాలీ ప్రారంభించి చెరువు కట్టలకు చేరుకోవాలని సూచించారు. చెరువుల కట్టలపై నెలకొన్న కట్ట మైసమ్మ దేవతలకు ముదిరాజ్ ల సహకారంతో మొక్కులు అప్పజెప్పాలని తెలిపారు.

అనంతరం మహిళలతో బతుకమ్మలు ఆడి బోనాలు సమర్పించాలన్నారు. చెరువుకట్టపై సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి రంగంలో గత 2014వ సంవత్సరం నుండి ప్రస్తుతం వరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యకలాపాలపై చర్చలు చేయాలని తెలిపారు. తదనంతరం ఏర్పాటు చేసిన భోజనాలు ప్రజలకు అందించాలన్నారు. ఊరూరా పండుగ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ముఖ్య భూమిక పోషించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాణి, ఎంపీఓ పసరగొండ రవి, కార్యదర్శులు అబేదాబేగం, ఉష, దివ్య, స్రవంతి, యుగేందర్, సుధాకర్, చంద్రశేఖర్ తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి



నవతెలంగాణ-శాయంపేట

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అటవీ సంపద తగ్గిపోతుందని సీఎంకేసీఆర్ హరిత హారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలుపరుస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ఐదుమొక్కలు నాటాలన్నారు. మొక్కలతోనే కాలుష్య నియంత్రణ జరు గుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్ ను కలసిన స్మార్ట్ సిటీ డైరెక్టర్



నవతెలంగాణ-వరంగల్

స్మార్ట్ సిటీ మిషన్ క్రింద కొనసాగుతున్న పనుల పరిశీలన నిమిత్తము వరంగల్ మహానగర పర్యటనకు వచ్చిన కేంద్రపట్టణ, గృహవ్యవహారాల మంత్రిత్వ శాఖ సంచాలకులు రోహిత్ కక్కర్, మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాలను జీడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు నగరంలో స్మార్ట్ సిటీ మిషన్ క్రింద కొనసాగుతున్న పనుల ప్రగతిపై చర్చించారు. మరికొన్ని అభివద్ధి పనులు వివిధ పురోగదశలలో ఉన్నాయని,అన్ని అభివద్ధి పనులు సెప్టెంబర్ చివరి వరకు పూర్తయ్యేలా చూడాలని వారు డైరెక్ట ర్ ను కోరారు.ఎస్ ఈ లు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, ఈఈ లు రాజయ్య, శ్రీనివాస్, స్మార్ట్ సిటీపిఎంఈ ఆనంద్ వోలెటి, డీఈ రవి కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించండి : కమిషనర్



నవతెలంగాణ-వరంగల్

సీజీజీలో తలెత్తే సాంకేతిక సమస్యలను సత్వర మే పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ ప్రాజెక్టు లీడర్ రవి జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో సీజీజీలో తలెత్తిన సాంకేతిక, ఆన్లైన్, తదితర సమస్యలను పరిష్కరించారు. ఇంకను మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ సూచించారు.నగర ప్రజలకు ఆన్లైన్‌లో సాంకేతిక పరంగా ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్క రించుటకు గాను సీజీజీ నుండి ఒక ప్రతినిధి ని గ్రేటర్ వరంగల్ కు వెంటనే నియమించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటి మేనేజర్ రమేష్ ఉన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్



నవతెలంగాణ-హన్మకొండ

ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న టిఎస్ ఆర్టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టిఎస్ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ ప్రెస్ క్లబ్ లో టిఎస్ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షులు ఉప్పు సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జరిగిన తొలిదశ , మలిదశ మరియు సకలజనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర అత్యంత ప్రధానమైనదని ముఖ్యమంత్రి కేసీఆర్ కు కూడా తెలుసని తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నైనా హాలో డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.టీఎస్ఆర్టీసీ విశ్రాంతఉద్యోగులకు ఆసరా పెన్షన్లు ఇవ్వాలని, ఆహార భద్రతకార్డులు కల్పించాలని ,రాష్ట్ర పెన్షనర్లకు ఇస్తున్న ఆరోగ్య భద్రత కార్డులను మాకు కూడా ఉచితంగా వైద్య వసతి కల్పించాలని ఇల్లు లేని వారికి ఉచితంగా నివాసగృహాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ సమా వేశంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ జనరల్ సెక్రెటరీ సిఎల్ఎన్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం.నర్సింగరావు, నాయకులు సూర్యనారాయణ, బూర నారాయణ, కేఎస్‌చారి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నారం సర్పంచ్‌పై కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు



నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ సర్పంచ్ మునుకుంట్ల యశోద పై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీపీవో కల్పనకు మంగళవారం ఫిర్యాదు చేసనట్లు వార్డు సభ్యులు మోటపోతుల సుదర్శనం, దొంతమాల మమత, గాడిపెల్లి భాగ్యమ్మ, ముంజంపల్లి స్వప్న తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జీపీ భవన నిర్మాణం నాణ్యతలోపంతో నిర్మిస్తున్నారని వారు ఆరోపించారు. జీపీపరిధిలోపైపులైన్ల లీకేజీలను పంచాయతీ సిబ్బందితో చేయించి రూ.32 వేల రూపాయలు తప్పుడు లెక్కలు చూపుతున్నారని అన్నారు. స్థానిక హలాల్‌గడ్డెవద్ద చిన్నగదిని నిర్మించి సుమారు రూ.80 వేలు ఖర్చు అయినట్లుగా డబ్బులు డ్రా చేసుకున్నాడన్నారు. స్మశాన వాటిక వద్ద బోరు వేయించి ఎక్కువ ఫీట్లు వేయించినట్టు తప్పుడు రికార్డు చేసి డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులను విచారణ చేయమని ఆదేశించినప్పటికీ, సర్పంచ్ తో అధికారులు కుమ్మక్కై ఇప్పటివరకు ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ జిల్లా కలెక్టర్, డీపీవోను కలవనున్నట్లు వారు తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా వార్డు సభ్యులు కమీషన్ అడిగారని అది ఇవ్వకపోవడంతో తనను బ్లాక్ మేయిల్ చేసి ఇలా ఆరోపణలు చేస్తున్నారని, అలాగే నా వద్ద ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున అప్పుగా తీసుకుని అడిగే సరికి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని సర్పంచ్ యశోద తెలిపారు.

మృతుల కుటుంబాలకు నాగుర్ల పరామర్శ

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి విజయ్, నర్సక్కపల్లి గ్రామానికి చెందిన సురావు రాములు, ఓదెల రవి, నడికూడ గ్రామంగాని చెందిన తాళ్ల బక్కయ్య ల అకాల మరణం చెందగా వారి కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల కుటుంబాలకు అండగా ఉంటానని, ఎటువంటి ఆపద వచ్చిన పెద్దన్న లాగా మీకు నా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పులిగిల్ల గ్రామ సర్పంచ్ సదానందం, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ నాయకులు అశోక్ గౌడ్, సత్యం, శ్రీనివాస్, అశోక్, రవీందర్, భుజంగారావు, సుమన్, దేవరావు, సంజీవరావు, లక్ష్మణరావు, మోహన్‌రావు, తెలంగాణ బిసి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు వరి కెల కిషన్‌రావు, ఉపసర్పంచ్ నాగూర్ల ధర్మారావు, నాగూర్ల సంతోష్, నర్సింగ‌రావు, నాగుర్ల యువసేన నాయకులు లోకటి నగేష్, లోనే సతీష్, దామెర్ రాజు, నాగరాజు, అభిరామ్, భాస్కర్, సతీష్, రమేష్, కిషన్ రావు, శంకర్రావు, బాబురావు తది తరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల దీక్షల వాల్‌పోస్టర్ విడుదల



నవతెలంగాణ-శాయంపేట

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలంటూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు బుధవారం నుండి చేపట్టనున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సామల మల్లయ్య పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించి ముద్రించిన వాల్‌పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో రేషన్‌డీలర్లు విడుదల చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంతవరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ రెడ్డి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించి నెలకు రూ.30వేల గౌరవవేతనం చెల్లించాలని, రేషన్‌షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా తీర్చిదిద్దాలి. రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు జారి చేయాలని, మరణించిన డీలర్లకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు, కుటుంబ సభ్యులలో ఒకరికి ఎలాంటి నియమ నిబంధన లేకుండా రేషన్ షాపు కేటాయించాలన్నారు.

రెడ్ క్రాస్‌ను సందర్శించిన విశ్రాంత అధికారులు



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ ను హెచ్ వై ఎం ఇంటర్నేషనల్ ఐ ఎస్ ఓ 9001 :2015 క్వాలిటీ సర్టిఫికేషన్ కు సంబంధించిన హెచ్ వై ఎం మేనేజింగ్ డైరెక్టర్ ఏ శివయ్య, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి టి.సుందర్ రామయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి హన్మకొండ రెడ్ క్రాస్ పాలకవర్గం స్వాగతం పలికి పూలబొకేను అందించారు. మొదట జనరిక్ మెడికల్ షాప్ సందర్శించి నాణ్యమైన మందులను అతితక్కువ ధరలలో అందించడం తలసీమియా సెంటర్‌ను సందర్శించి రక్తం కొరత లేకుండా తలసీమియా పిల్లలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. బ్లడ్‌సెంటర్ రక్తసేకరణ, రక్త పరీక్ష, పంపిణీ సమయంలో రక్తం నాణ్యత అంచనచేసి ఐఎస్ఓ గుర్తింపు ఇవ్వడానికిబ్లడ్ సెంటర్ ను మేనేజింగ్ డైరెక్టర్ ఏ.శివయ్య రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జిటి.సుందర్ రామయ్య పరిశీలించారు. రెడ్ క్రాస్ సొసైటీ పరిసరాలు పరిశుభ్రంగా నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవి.శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులుపొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ సిహెచ్.సంధ్యారాణి, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్స్ డా. కిషన్‌రావు, డాక్టర్ సిహెచ్.సత్యం రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-శాయంపేట

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందజేస్తున్నామని జెడ్ పి హెచ్ ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు అన్నారు. శాయంపేట గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పాఠశాలలో విద్యార్థులు సాధించిన ప్రగతి పై ముద్రించిన ఫ్లెక్సీ తో ర్యాలీని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న సేవలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గుండు సదానందం, ఉదయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద గుట్ట రక్షనే.. పరిరక్షణ సమితి లక్ష్యం



నవతెలంగాణ-రాయపర్తి

కేశవాపురం పెద్దగుట్ట రక్షణ.. పరిరక్షణ సమితి లక్ష్యం అని పెద్దగుట్ట పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు. మంగళవారం మండలంలోని కొలనుపల్లి, ఆరేగుడెం, కేశవాపురం, జయరాం తండాలకు జీవనధారమైన పెద్దగుట్టను పర్యావరణ పరిరక్షణ నిపుణులు, హైకోర్టుఅడ్వకేట్, డాక్టర్లు సందర్శించి పరిశీలించి గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి గుట్టపై గ్రానైట్ పనులు చేపట్టడం వల్లజరిగే అనర్థాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్ద గుట్టపై గ్రానైట్ పనులు చేయ కుండా స్థానిక ప్రజలుఉద్యమించాలని తెలిపారు. పెద్ద గుట్ట జీవవైవిద్యానికి సంజీవని వంటిదని వివరించారు. ఆయుర్వేద మొక్కలు పుష్కలంగాఉన్నాయన్నారు. ముఖ్యంగా భూగర్భజలాల పెరుగుదలకు పెద్దగుట్ట ఎంతో తోడ్పడుతుందని వివరించారు. సర్వేనెంబర్ 132లో 137 ఎకరాల్లో విస్తరించి ఉన్న పెద్దగుట్టలో కొంతభాగాన్ని కలర్ గ్రానైట్‌తవ్వకాల కోసం ప్రభుత్వం20 యేండ్లకు లీజుకిచ్చిందని దాంతో భవిష్యత్తులో పెద్దగుట్ట మొత్తం మాత్రమే కాకుండా, ప్రక్కన ఉన్న ఎర్రబోడు, బైరోనిగుట్ట, దేవునిగుట్ట కూడా తవ్వకానికి గురవుతాయి అని వివరించారు.

సహజంగా లభించే కోట్లాది రూపాయల విలువచేసే పాలిరైటిక్ స్టోన్, కలర్ గ్రానైట్‌రాయి కొరకు పచ్చని గుట్టగుండెను బాంబులతో పేల్చివేసి, ప్రొక్లెయిన్లతో విధ్వంసం చేయాలని కార్పొరేట్ శక్తులు చూస్తున్నాయని తెలిపారు. గుట్టతవ్వితే రకరకాల వేలాది పచ్చనిచెట్లు మాయమైపోతాయని సహజంగా పెరిగే చెట్లను నరికివేయడం సరైన పనికాదు అన్నారు. క్వారీ ద్వారా కలుషిత, రసాయనిక పదార్థాలు నీటిలో కలిసి చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు విషపూరితమవుతాయి, కలుషిత నీటిని పశువులు, జీవాలే కాకుండా మను ష్యులు తాగడం వలన క్యాన్సర్ వంటి వివిధ రోగాల బారినపడతారు అని పేర్కొన్నారు. దిగుబడి రాక రైతులు బిచ్చగాళ్ళుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దయ తలచి క్వారీ లైసెన్స్ రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, సామాజిక కార్యకర్త శశిధర్ రెడ్డి, రవీందర్ పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధి జక్కుల రాజు, చిదుముళ్ల కృష్ణ, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పునరుద్ధరణకు అధికారుల స్పందన




'నవతెలంగాణ'కు స్పందన

యుద్ధప్రాతిపదికన పనుల వేగవంతం

నెలరోజులైనకాని పనులు ఒక్కరోజులోనే పూర్తి

కృతజ్ఞతలు తెలిపిన రైతులు

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని పెంబర్తిలో ఈదురుగాలులకు 'నేలకొరిగిన విద్యుత్ స్తంభం ... పట్టించుకొని విద్యుత్ అధికారులు' అనే అంశంపై నవతెలంగాణ దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించారు. నెలరోజులుగా విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై నవతెలంగాణ దినపత్రిక ప్రచురించిన కథనంతో విద్యుత్ ఏఈ మంగమ్మ తక్షణమే స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన పనుల వేగవంతానికి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే పెంబర్తి శివారులో ఇటీవల ఈదురు గాలులతో తాటిచెట్టు పడి విద్యుత్ తీగలు తెగిపడడమే కాకుండా నేలకొరిగిన విద్యుత్ స్థంబం స్థానంలో సిమెంట్ పోల్ వేసి లైన్ పునరుద్ధరణ పనులను మంగళవారం ఒక్కరోజులోనే పూర్తి చేశారు. దీంతో పెంబర్తి శివారు రైతులు విద్యుత్ అధికారుల పనితీరుకు, నవతెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజనీరింగ్ విభాగం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఎస్సార్‌యూ 98వ స్థానం

చాన్స్‌లర్ వరదారెడ్డికి జ్ఞాపికను అందజేసిన ఎస్సార్‌యూ వీసీ



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం సోమవారం ఎహెచ్ఆర్‌డీ ప్రకటించిన ఇంజనీరింగ్ విభాగం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 98వ ర్యాంకు సాధించింది. యూనివర్సిటీలో ఈ సందర్భంగా జరిగిన విలేఖరుల సమావేశంలో ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రకటించిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ఎన్ఐఆర్ఎఫ్-2023 ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ విభాగంలో ఎస్సార్ యూనివర్సిటీ 98వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. యూనివర్సిటీ విభాగంలో 101-150 ర్యాంక్ బ్యాండ్‌లో నిలిచిందని, ఓవరాల్ క్యాటగిరిలో 151-200 ర్యాంక్ బ్యాండ్‌లో నిలిచిందని తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ ఇనిస్టిట్యూషన్‌లో ఎస్సార్ యూనివర్సిటీ ప్రథమంగా నిలిచిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యం, జాతీయ, అంతర్జాతీయ ఒప్పందాలు, అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలు, పేటెంట్లు, నాణ్యమైన విద్యవల్ల ఇది సాధ్యమైందన్నారు. యూనివర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరేట్ చేసిన సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. న్యాక్, ఎన్‌బీఏ అక్రిడేషన్స్‌ను సాధించడం జరిగిందన్నారు. యూనివర్సిటీలో ఎన్నో రిసెర్చ్ సెంటర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సార్‌ఐఎక్స్ ఇమ్యునేషన్ సెంటర్ ద్వారా ఎన్నో స్టార్ట్ అప్స్‌కు అంకురార్పణ జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన వీసీని, ప్రొఫెసర్లను, సిబ్బందిని అభినందించారు.

ఎస్సార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఎస్సార్ యూనివర్సిటీలో ఎన్నో అవకాశాలు విద్యార్థులకు ఉన్నట్లు నాణ్యమైన ప్లేస్‌మెంట్స్‌కు అవకాశాలు న్నాయన్నారు. ఎస్సార్ యూనివర్సిటీలో ఎజడ్, ఐటీ మీద విద్యార్థులు ప్రాజెక్టులు, ఇంటర్న్‌లు చేస్తున్నట్లు తెలిపారు. నూతన సాంకేతికతలో ఎస్సార్ యూనివర్సిటీ ముందున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరిశోధకుల సంఖ్య, ఫ్యాకల్టీ క్వాలిఫికేషన్స్, ఫైనాన్షియల్ రిసోర్సెస్, పరిశోదనలు, పీర్‌పర్సెప్షన్ అంశాల ఆధారంగా ఇంజనీరింగ్ విభాగంలో ఎస్సార్ యూనివర్సిటీ 98వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా 98వ ర్యాంకు సాధించిన జ్ఞాపికను చాన్స్‌లర్ వరదారెడ్డికి ఎస్సార్ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్‌బిజినెస్ డీన్‌లు డాక్టర్ పురుసోత్తమచారి, డాక్టర్ సివి.గురురావు, డాక్టర్ విజయ, గుంటూరు, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, డీన్ ఫ్యాకల్టీ అఫైర్ డాక్టర్ వి.మహేష్, హెడ్స్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలి

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హసన్‌పర్తి

రేజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ బూషన్ సింగ్‌ను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద ప్రధాన కూడలీలో లిబ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు మంద సుచందర్ మాట్లాడారు. గత 49 రోజులుగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వాళ్ల పోరాటాన్ని అణిచివేయాలని చూడడం సిగ్గుమాలిన చర్య అన్నారు. బీజేపీ ఎంపీని రక్షించేందుకే ప్రభుత్వం ఇప్పటివరకు అరెస్టు చేయలేదన్నారు. ప్రపంచస్థాయిలో క్రీడల్లో దేశాన్ని నిలపడమే కాకుండా దేశ ప్రతిష్టను కాపాడేందుకు, పథకాలు తీసుకొచ్చిన వారి మీద లైంగిక వేధింపులకు పాల్పడడం ఏంటని ప్రశ్నించారు. బేటీ బడావో బేటి బచావో అంటే మహిళలపై లైంగిక వేధింపులేనా అని ప్రశ్నించారు. ఉన్నత స్థాయిలో ఉన్న ఎంపీ ఈ రకంగా క్రీడాకారులపై వేధింపులకు పాల్పడితే వాళ్లకు రక్షణ లేదన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రేజర్లకు రక్షణ కల్పించాలని, బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేసి, ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ యంగ్ ఉమెన్స్ రాష్ట్ర కో కన్వీనర్ మౌనిక,మండల నాయకులు లోకిని రమేష్, చందు, సంతోష్, హరికష్ణ, వినోద్, సురేష్, రేణుక, యాదలక్ష్మి రేవతి పాల్గొన్నారు.

గోవుల హింస శ్రేయస్సు కాదు

టీజీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



నవతెలంగాణ-పెద్దవంగర

గోవులను హింసించడం శ్రేయస్సు కాదని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మహేశ్వరి గోశాల ప్రతినిధి కిరణ్ అధ్యక్షతన అవుతాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గోవులను వధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోవధను నిరోధించాలన్నారు. ఇలాంటి ఘట నలు పునరావతం కాకుండా అరికట్టాలన్నారు.

గోవధ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పటిష్టమైన చట్టాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పశువుల అక్రమ రవాణా తో పాటుగా, జంతు వధను నిరోధించడానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలన్నారు. బక్రీద్ రోజున ఆవులను సామూహికంగా చంపడాన్ని నిరోధించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, వాహనాల్లో ఆవులను తరలిస్తే ఆయా వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోశాల కార్యాలయ సూపరిండెంట్ దుర్గం రోజా, గోశాల కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-పెద్దవంగర

ఈనెల 8న నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరామ్ జ్యోతిర్మయి, నీటిపారుదల శాఖ డీఈ పూర్ణచందర్ అన్నారు. ఊరూరా చెరువుల పండగ ఏర్పాట్లపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ రమేష్ బాబు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మతో కలిసి సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రతి చెరువు వద్ద పండుగ వాతావరణం కన్పించేలా అలంకరణచేపట్టి, కట్ట మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయాలన్నారు. కట్టకు దగ్గరలో విశాలమైన స్థలంలో స్టేజీ ఏర్పాటు చేసి కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాలన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రజలంతా ఊరేగింపుగా చెరువుకట్టవద్దకు చేరుకోవాలన్నారు. చెరువులోకి ఎవరినీ వెళ్లనీయవద్దన్నారు. విద్యుత్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మత్స్యకా రుల సంఘాల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలోఏఎస్ఐ విజయరాజు, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, ధరావత్ బీమా, దుంపల జమున, గాజుల శోభ, జగ్గానాయక్, ఎంపీటీసీ సభ్యులు ఎర్ర సబిత, నీటిపారుదల శాఖ ఏఈ స్వాతి, ఆర్ఐ భూక్య లష్కర్, ఏపీడీపీఓ ఇందిరమ్మ, ఏఈఓలు మానస, యశస్విని, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ యాకూబ్ పాషా, సీసీలు సుజాత, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య



నవతెలంగాణ-పెద్దవంగర

లేబర్ ఇన్సూరెన్స్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వంకల్పించే లేబర్ ఇన్సూరెన్స్ కోసం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా ఇన్సూరెన్స్ అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు మినహా, 18-55 వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. లేబర్ ఇన్సూరెన్స్ కోసం కార్మికులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌ఫోటో జత చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు బంధు వెంకన్న, బోనగిరి లింగమూర్తి, రాసాల వెంకన్న, కొండపల్లి విజయపాల్ రెడ్డి, నీలం సోమయ్య, బానోత్ శ్రీనివాస్, నాయకులు జలగం శేఖర్, బానోత్ గోపాల్, ఉపసర్పంచ్ బానోత్ చంద్రశేఖర్, వెంకటసోములు, నారాయణ, బొమ్మెరనగేష్, అంజనేయులు,సోమనర్సయ్య, మైలపాక యాకయ్య, ఆలకుంట్ల కొమురయ్య, ఏదెల్లి ఎల్లప్ప, ఎదునూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఎస్ సంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలంగాణ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని పారిశ్రామిక ఉత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం హనమకొండ భీమారంలో టాస్క్, వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాలల చైర్మెన్ డాక్టర్ ఇ.తిరుమల్ రావు జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు ఎల్లప్పుడూ స్కిల్స్ మెరుగుపరుచుకొనవలసిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి శ్రద్ధతో ప్రయత్నిస్తే మంచి ఉద్యోగావకాశాలకు తెలంగాణలో కొదువలేదని పేర్కొన్నారు. ఈనెల 14న జాబ్‌మేళా ఎస్వీఎస్ కళాశాలలో నిర్వహింపబడుతుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జరిగిన జాబ్ మేళా జెనపాక్ట్, ఇమర్‌ఐ, హచర్, ఐఫల్, ముతూట్ ఫైనాన్స్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్సు, జీయోకంపెనీ, ఈఎంఆర్ఐ హెల్త్ సర్వీస్ 510 వంటి కంపెనీలు పాల్గొన్నాయి. కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీ ఉద్యోగాల వివరాలు వాటికి కావలసిన అర్హతలు ఎంపిక విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ రీజినల్ మేనేజర్ రామక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌రఘు, డీన్లు సీహెచ్.సుశాంత్, బీ. గోపాల్ రావు, డి.విక్రమ్, పుల్లూరి నాగేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మైలారం ప్రజలు



నవతెలంగాణ-రాయపర్తి

మైలారం గ్రామ ప్రజలు మానవత్వం చాటి మతుని కుటుంబానికి భారీగా నిధులు సేకరించి మంగళవారం ఆర్థిక సహాయం అందచేశారు. వివరాల్లోకి వెళ్తే మైలారం గ్రామానికి చెందిన కోరం సోమిరెడ్డి ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉండగా గ్రామ పెద్దలు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి రూ 50, 000, పదవతరగతి మిత్రులు రూ 22000, బంధువుల రూ13000, రూపాయలు, పలువురు గ్రామస్తుల నుంచి 1,15,000 రూపాయలు సేకరించి అందచేశారు. కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుమతి యాదవరెడ్డి, మైపాల్ రెడ్డి,కోరం సాయి రెడ్డి, రాజిరెడ్డి, వంశిధర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాటతో పాలకులను కదిలించవచ్చు : పీఎన్ఎం



నవతెలంగాణ-మట్టెవాడ

పాట ఎంతో శక్తిమంతామైనదని కొన్ని సందర్భాల్లో పాట మాట కంటే పదునుగా మనుషుల్లోకి చొరబడుతుందని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దుర్గయ్య అన్నారు. వరంగల్ జిల్లా స్థాయి పాటల పోటీ శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం రఘునాథ భవన్లో ప్రారంభోత్సవ కార్యక్రమన్నీ ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలు పడుతున్న కష్ట నష్టాలను పాటల ద్వారా పాలకులకు తెలియజేస్తూ ప్రజల్లో ఉత్తేజాన్ని చైతన్యాన్ని నింపేదే పాట అని అన్నారు. కొన్ని పాటల ద్వారా ప్రభుత్వాలు పడిపోయిన సంఘటనలు చరిత్ర పుటల్లో లిఖితం అయి ఉన్నాయనీ అన్నారు. సమాజంలో రుగ్మతలు కులం మతం, లింగ అసమానత, ఆర్థిక విలువలను అవగతం అయ్యేలా తెలియ చెప్పేదే పాట అని అన్నారు. పాట పాడే కళాకారుడు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ వారి బాగోగుల కోసం పాటలను పాడుతూ ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలని కోరారు. నేటి ఆధునిక సమాజంలో కూడా మూఢనమ్మకాలపై ప్రజలు విశ్వాసాన్ని తెలియజేస్తున్నారని వాటిపైన పాటల ద్వారా కళాకారులు జాగతి పరచాలని అన్నారు ఈ కార్యక్రమం ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు అనిల్, ప్రిన్సిపల్ వ్యవహార కర్త రాజేష్ ఖన్నా, జిల్లా నాయకులు ఆర్ ప్రవీణ్, జానీ, పాశా, రాజేష్, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి శిక్షించాలి



నవతెలంగాణ-మట్టెవాడ

మహిళ రెజ్లర్లపై దుశ్శాసన పర్వానికి ఒడిగట్టిన ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి శిక్షించాలని ఐద్వా వరంగల్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది సోమవారం ఏసురెడ్డి నగర్‌లో ని మెయిన్ రోడ్డుపై మాలోతు ప్రత్యూష అధ్యక్షతన రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రాస్తారోకో ను ఉద్దేశించి ఐద్వ వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటిరత్నమాల మాట్లాడుతూ మహిళా రేజ్లర్లపై పోలీసుల లాఠీచార్జీని భారతదేశపౌరులంతా ఖండించాలన్నారు. ఎంపీ బ్రిజ్ భూషణ్ దుసశాసన పర్వాన్ని బయట పెట్టారనే ఆక్రోశంతోనే రేజలర్ ముఖంపై బూటు కాలితో తొక్కుతూ ఖాకీలు క్రౌర్యం ప్రధారహిస్తున్న ప్రధాని నోరు తెర్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. బ్రిజభూషన్ను ఎంపీ పదవీనుండి తొలగించి లైంగికవేధింపులు అత్యాచార, బెదిరింపులు హత్యయత్నం కేసులను నమోదు చేసి రేజలార్లకు న్యాయం చెయ్యాలని అన్నారు. బేటీ బచ్చవ్ అంటూ ఆడపిల్లలను అబద్రతభవానుకి గురిచేసే కీ గుణపాఠం చెప్పాలన్నారు .ఈ రాస్తారోకోలో టీ భవాని, జిల్లాకామిటిసభ్యులు కవిత, రేణుక , సుహాసిని, విజయ, కోమల, జయక్క, తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి చెలిమే బావిలో కొండచిలువ



నవతెలంగాణ-శాయంపేట

పెద్దకొడపాక గ్రామంలోని మంచినీటి చెలిమే బావి చుట్టుపక్కల ప్రాంతాలలోని ప్రజలకు మంచినీటి దాహార్తిని తీర్చుతుంది. రోజు మాదిరి గానే మంగళ వారం ఉదయం మహిళలు త్రాగునీటినీ తెచ్చు కోవడానికి భావి వద్దకు రాగా బావిలో అతి పొడవైన కొండచిలువ కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. వారు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు భావి వద్దకు వచ్చారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డికి సమాచారం ఇవ్వటంతో ఆయన వచ్చి సందర్శించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అశోక్, సిబ్బంది బావి నుండి కొండచిలువను బయటకు తీశారు. అడవిలో కొండచిలువను వదిలి వేస్తామని తెలియజేశారు. మంచినీటి చెలిమే బావిని శుభ్రం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి ప్రజలకు తెలియజేశారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే మోహన్‌కు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రోల్లకల్లు శివారు చెరువు ముందు తండాలో లూనావత్ మోహన్ అనే వ్యక్తికి విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే మోహన్‌కు మంగళవారం నడుము విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వ్యవసాయ విద్యుత్ కు సంబంధించి రిపేర్ ఉండడంతో సంబంధిత అన్మాండ్ వర్కర్ మోహన్ కు డబ్బులు ఇచ్చి ఎన్నిసార్లు చెప్పినా రిపేరు చేయలేదని, మీరు రిపేరు చేసుకుంటానంటే నేను ఎల్సీ తీసుకుంటానని సిబ్బంది మోహన్ చెప్పాడని బీలు నాయక్, లాల్‌సింగ్, హాము, మోహన్ చెప్పారు. దీంతో లూనావత్ మోహన్ స్తంభానికి నిచ్చెన వేసుకుని రిపేరు చేస్తుండగా... రెండు వైర్లకు జంపర్లు కలపబడి ఉండడం వలన కరెంటు సరఫరా వచ్చి మోహన్ కు షాక్ కొట్టింది. ఏ బి స్విచ్ ఓపెన్ చేసిన తర్వాత కరెంట్ సప్లై కావడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోహన్ కు షాక్ కొట్టడంతో అతని నడుము విరిగి తీవ్ర గాయాల పాలయ్యాడని ప్రస్తుతం వరంగల్ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడని అన్నారు.

సంఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకొని బాధితునికి నష్టపరిహారం అందించాలని తండా రైతులు కోరుతున్నారు.

పచ్చని తోరణంగా నర్సంపేట







చేను సెలకల్లో గోదావరిమ్మ పరుగులు..

దేవాదుల, ఎస్సారెస్పీతో చెరువుల్లో ఉట్టిపడిన జలకల..

పులకరించిన ఆయకట్టు..రెండు పంటలు సాగు..

ఫలించిన ఎమ్మెల్యే 'పెద్ది' ఇరిగేషన్ సర్క్యూట్ డిజైన్..

నేడు నియోజకవర్గ వ్యాప్తంగా 'సాగు నీటి పండుగ'



నవతెలంగాణ-నర్సంపేట

నియోజకవర్గంలోని చేను..సెలకల్లో గోదావరిమ్మ పరుగులు పెడుతుంది..దేవాదుల ఎత్తిపోతల పథకం.. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలతో చెరువులన్నీ నిండు కుండలా మారాయి.. ఒక నాడు నెర్రలు వారిన నేల నేడు ఉ గిసిపడి పులకరించింది..ఆయకట్టంతా రెండు పంటలతో పచ్చని తోరణంగా అలంకరించుకొంది..ఎమ్మెల్యే పెద్ది సుద ర్శన్‌రెడ్డి రూపొందించిన 'ఇరిగేషన్ సర్క్యూట్' వెంట గోదా వరిజలాలు పరుగులు పెట్టింది.. ఆయన సంకల్ప బ లం. .నిరంతర కృషి.. అనతిలోనే సత్ఫలితాలు ఇచ్చిం ది..రైతుల కల సాకారమైంది..1.26 లక్షల ఎకరాల ఆయకట్టులో సాగు విస్తీర్ణానికి చేరుకొంది.. చేతికొచ్చిన దిగుబడులతో రైతుల మొఖాల్లో ఆనందం వెల్లువిరుస్తుంది..ఈ నేపథ్యంలో నిర్వ హిస్తున్న తెలంగాణదశాబ్ది ఉత్సవాలలో నేడు ఊరూ రా.. చెరువుల గట్టులపై సాగునీటి పండుగకు అన్నదాతలు సర్వం సన్నద్ధమవుతున్నారు.

రూ.336 కోట్లతో రామప్ప-పాకాల ప్రాజెక్టు నిర్మాణం..

రూ.225 కోట్లతో రామప్ప-రంగయ చెరువు నిర్మాణం

పాకాల సరస్సులోకి గోదావరి జలాలను నింపడానికి ప్ర భుత్వం రూ.336 కోట్లతో రామప్ప-పాకాల, రూ.225 కోట్ల తో రామప్ప-రంగయ చెరువు ఎత్తిపోతల పథకం మంజూరు చేసింది.మొదట్లో రంగయ చెరువు ప్రాజెక్టుపై రైతులచే అనేక అడ్డంకులు ఎదురైయ్యాయి.ఊర్లకు ఊర్లు నిరాశ్రుయలుగా మారుతున్న తరణంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ముంపు భారిన పడకుండ ప్రత్యమ్నా ప్రాజెక్టు డిజైన్ చేయించారు. ఈ రెండు ప్రాజెక్టులకు రామప్ప వద్ద పంప్ హౌజ్‌లను నిర్మితం చేశారు. అక్కడి నుంచి వేర్వేరుగా పైప్‌లైన్ పనులు వేగవం తంగా పూర్తి చేసి రెండేండ్ల క్రితమే పనులు పూర్తి చేసుకొని పాకాల, రంగయ చెరువుల్లోకి గోదావరి జలాలను నింపారు. ఫలితంగా ఈ యేడాది ఈ రెండు చెరువుల కింద సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టులో రెండు పంటలకు సాగు నీరు అందింది.. ఇదిలా ఉంటే మరో వైపు ఎస్సారెస్పీ డీబీఎం 38, 40,48 కాల్వలద్వారా 43,333 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు చేరుకొంది. మిషన్ కాకతీయ కింద రూ.66 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులతో 272 చెరువుల కింద 32 వేల 287 ఎకరాల ఆయకట్టులో రెండు పంటలు సాగు కావడం మరో రికార్డు సృష్టించిందనే చెప్పాలి. ఇదిలా ఉంటే పాకాల, మున్నేరు, వట్టెవాగులపై రూ.36 కోట్లతో నిర్మించిన 13 చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో 39 కిలో మీటర్‌ల మేరకు నీటి నిల్వగామారి అదనపు ఆయకట్టు సాగైయింది. అడుగడు గునా జల కల ఉట్టిపడిన ఫలితంగా భూగర్భ జలాలు ఉగిసిపడుతున్నాయి. 24 గంటల వి ద్యుత్ సరఫరావల్ల బోరు, బావుల కింద కూ డా రెండు పంటలను రైతులు సాగు చేసుకో గలిగారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరుప పంటల సాగు అత్యధికంగా పెరిగింది. కూర గాయలు,ఆరుతడిపంటల సాగుకు కొదువలే దు. ఒక నాడు వ్యవసాయమే దండు గ అనే అభిప్రాయం వ్యక్తం కాగా 9ఏళ్లలో వ్యవసా యం పండుగలా అవతరించింది. ఈ నేప థ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహి స్తున్న దశాబ్ది వారోత్సవాలలో నేడు'సాగునీటి దినోత్సవంలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాలను పాలుపంచు కొని ఆశ్వాదించా లని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరుతున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-తొర్రూరు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తొర్రూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సోమిరెడ్డి ఆధ్వర్యంలో మండల డీలర్ల సమావేశం ఏర్పాటు చేసి తహసి ల్దార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు సోమిరెడ్డి లు మాట్లాడుతూ.. అతి తక్కువ కమిషన్ తో డీలర్ రేషన్ షాప్ నడిపిస్తున్నామని, వచ్చే కమిషన్ తో బ్రతకలేక, కుటుంబాలు పోషించుకోలేక రేషన్ డీలర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.గత 9 సంవత్సరాల నుండి ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినా ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంధు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొర్రూర్ మండల పరిధిలో గల రేషన్ షాపులను బంధు చేస్తున్నామని తెలుపుతూ, రేషన్ డీలర్లకు అధికారులు, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏడెల్లి రామచంద్రు,కోశాధికారి బి.ఎలేంద్ర, మండల పరిధిలోని గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యా సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

హనుమంతులేని విద్యాసంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో సూపర్డెంట్ ప్రణీత్ కుమార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. లిఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ ఇంకా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తున్న కాలేజిలు,స్కూల్స్ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే విద్యార్థుల నుండి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాల కళాశాలల్లో ఫీజు డిటైల్స్ తో బోర్డు ఏర్పాటు చేయాలని నియమ నిబంధనలు పాటించకుండా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మభ్య పెడుతూ అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. జీఓ నెంబర్ 1 ని తుంగలోకి తొక్కి అక్రమ అడ్మిషన్స్ చేస్తున్న పాఠశాలల, కళాశాలల పైన తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను బస్ లో పంపకుడదని, సీనియారిటీ కలిగిన అధ్యాపకులను నియమించాలని, విశాలమైన తరగతి గదుల్లో బోధన చేయాలని, ఇరుకైన, సరైన గాలి వెలుతురు లేని గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టారాదని, యూనిఫాం ఫీస్, పాఠ్య పుస్తకాల ఫీజులను తగ్గించాలని, నాన్ టీచింగ్ స్టాఫ్ ను ఏర్పరచుకోవాలని, ఆదివారాలలో కూడా క్లాస్ లు నిర్వహించడం సరికాదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షుడు బాదావత్ రాంబాబు, నాయకులు, బాదావత్ రెడ్డి, భుక్య సుమన్, తదితరులు పాల్గొన్నారు.

నాడు ఆజంజాహి మిల్‌ను అమ్ముకున్నది కాంగ్రెస్సే

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్





నవతెలంగాణ-వరంగల్

వరంగల్లో ఉన్న ఆజాంజాయి మిల్ ను అమ్ముకొని, 4వేల మంది కార్మికులను రోడ్డున పడేసినది నాడు కాంగ్రెస్ ప్రభుత్వ మే అని వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలలో భాగంగా మంగళవారం తెలంగా ణ పారిశ్రామిక విజయోత్సవ కార్యక్రమం ను కొత్తవాడ పద్మశాలి కమ్యూనిటీ హాల్ నుండి దేశాయిపేట కేఆర్‌గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిం చారు. అదే ఆ ర్యాలీలో చేనేత పనిముట్లతో ప్రద ర్శనగా కే ఆర్ గార్డెన్స్ వరకు వెళ్లారు. తదనం తరం కేఆర్ గార్డెన్‌లో పారిశ్రామిక విజయోత్సవ సమావేశం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్స్ శ్రీ వాత్స, అశ్విని,స్టేట్ హెల్త్ కమిటీ డైరెక్టర్ హరి రమాదేవి, ఆర్డీవో మహేందర్ జీ, హాజరయ్యారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడు తూ అజంజాహి మిల్ కార్మికులకు నేడు కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం 319 మందికి స్థలాలను కేటాయించారన్నారు.అజాంజాహి మిల్ నడప డానికి గతపాలకులకు చేతకాక, దమ్ము లేక అమ్ము కున్నారన్నారు.

నేడు కేసీఆర్,కేటీఆర్ నాయ కత్వనా తెలంగాణ ప్రభు త్వం సంగంలో 12వం దల ఎకరాల్లో మెగా టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేసుకున్నామని, టెక్స్ టైల్ పార్కులో వరంగల్ నుండి 10వేల మందికి ఉద్యోగ దొరకబోతుందనీ, కేసీఆర్,కేటీఆర్, అందరి సహకారంతో టెక్స్ టైల్ పార్కు బస్సులు పెట్టి చూపించి మన ప్రభుత్వం చేస్తున్న ప్రగతిని నివేదించి, ఉపాధిని కల్పిస్తామ న్నారు.తెలంగాణ రెండో రాజధాని, పెద్ద నగరం వరంగల్ అని చెప్పే కాంగ్రెస్,బీజేపీ ప్రభుత్వాలు ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయడం చేతకాలేద న్నారు. చేనేత వాడల్లో కొత్త పుంత లు తీసుకొని వచ్చి వారి బతుకుల్లో వెలుగులు నింపామన్నారు. కేసీఆర్ నాయకత్వనా, కేటీఆర్ చొరవతో కొత్తవా డ చేనేత పరిశ్రమ గొప్పగా విల సిల్లు తున్నదని కొత్త వాడ కార్మికులకు నేత పని పై ఆధార పడిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంద న్నారు.ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలో 35శాతం కార్మికులకు,5 చేనేత సొసైటీలు పొందుతు న్నాయనీ, కార్మికులకు సబ్సిడీ నేరుగా వారి ఖాతా ల్లో జమ చేయడం జరుగుతుం దన్నారు.59 ఏళ్ల లోపు గల చేనేతలకు చేనేత బీమా వర్తిస్తుందనీ, 59ఏళ్ల పైబడిన వారికి లేబర్ కార్డు అందిస్తామ న్నారు.కేసీఆర్, కేటీఆర్ సహ కారంతో ఎన్నికల అనంతరం రిగు రోడ్డు పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. 75 ఏళ్లలో 65 ఏళ్ల గత పాలకులు పాలించారు. కానీ ఏనాడు వరంగల్ తూర్పును పట్టించుకున్న నాధుడే లేడన్నారు.ఎన్నికలలో ప్రజలను డబ్బులతో కొనాలనుకునే వారు తప్ప ప్రజల ఎదుగుదలను పట్టించుకున్నవారు లేరన్నా రు.గతపాలకులు రోడ్లు,మోరీలు, నీళ్ల ఇయ్యలేని అసమర్థులు అని విమర్శించారు. ప్రజలకు, రైతుల కు ఎం కావాలని, తెలంగాణ సర్కారు వరంగల్ లో పరిశ్రమల ఏర్పా టుకు వడివడిగా అడుగులు మొదలు పెట్టింద న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎలగం లీలావతి-సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆర్థిక చేయూత

నవతెలంగాణ - కాటారం

కాటారం మండలం లోని గుమ్మళ్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మేదరి కుటుంబానికి చెందిన మొలంగిరీ మల్లక్క - కిష్టయ్య దంపతుల కుమార్తె వనిత వివాహం ఈనెల 7న జరగనుంది. మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీమంత్రి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆర్థిక చేయూత నివ్వడంతో పాటు వధూవరులకు దుస్తులు అందజేశారు. అన్నివిధాల అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు గైని రమేష్, మండల అధ్యక్షులు పాడి రాజయ్య, యువజన సంఘం జిల్లా ప్రధాకార్యదర్శి చిలువేరు శ్రీధర్, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పాడి సరోజన, రేపాల స్వామి, కాటారం ఎంపిపి పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, సర్పంచులు లత - బక్కిరెడ్డి, వేమునూరి రమేశ్ రెడ్డి, జాడి మహేశ్వరి , కంకణాల శ్రీనివాస్ రెడ్డి, కంకణాల రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

భూపాలపల్లి, ములుగు, జనగామ

బుధవారం 07 జూన్ 2023

6

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సీతక్క పరామర్శ



నవతెలంగాణ- ములుగు

ములుగు మండలం లోని జీవంతరావుపల్లి గ్రామానికి చెందిన కొండబోయిన సదయ్య మరణించాడు. మంగళవారం మృతుడి పార్థివ దేహానికి ములుగు ఎమ్మెల్యే సీతక్క పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే గ్రామానికి చెందిన చతాల పోశాలు ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్, స్థానిక సర్పంచ్ రత్నం భద్రయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు దేవ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా

సాగునీటి దినోత్సవం నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-మహదేవపూర్

అంగరంగ వైభవంగా సాగునీటి దినోత్సవం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మండలంలో నేడు అన్నారం బ్యారేజీ వద్ద లేజర్ లైట్ షో గాయని మంగ్లితో స్పెషల్ ప్రోగ్రాం ఉంటుందని అన్నారు. సాగు నీటి దినోత్సవం నిర్వహణపై మగళవారం అధికారులతో రీవ్యూ నిర్వహించారు. దానికి తగిన విధంగా అన్నారం బ్యారేజ్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ, ఇతర జిల్లా అధికారులతో కలిసి అన్నారం బ్యారేజీని సందర్శించి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. నేడు సాయంత్రం 5.30గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రంజిత బృందంతో పేరిణి శివ తాండవం, శ్రవ్య మానస బృందంతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, లేజర్ లైట్ షో, మంత్రుల సందేశాలు ఉంటాయన్నారు. అనంతరం సాగినీటి దినోత్సవ వేడుకలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. జిల్లా నలుమూలల నుండి జన సమీకరణ చేయాలని కోరారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్,ఎంఎల్ఏలు,ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారని విజయవంతం చేయాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు అన్నారం బ్యారేజ్ కి ఇరు వైపులా విద్యుత్ లైటింగ్ తో అలంకరించాలని ఆదేశించారు. పార్కింగ్, బ్యారేజ్ లో నీరు కనబడేలా సెల్ఫీ వ్యూను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. పటిష్ట బందోబస్తు , పార్కింగ్, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీహర్షిణీ, ఎంపీపీ బి రాణీబాయి, జెడ్పీటీసీ అరుణ, అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ప్రోగ్రాం ఈవెంట్ మేనేజర్, రవి, జిల్లా అధికారులు , సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు వద్ద సంబరాలు ఎలా చేస్తారు



నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుమూల మండలాల్లో భారీ వర్షాలతో గత ఏడాది గండ్లు పడిన చెరువులు ప్రాజెక్టుల పనులు చేయకుండానే ప్రాజెక్టు వద్ద సంబరాలు ఎలా చేస్తారని, దీనికి ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రులు సమాధానమివ్వాలని ఏఐసిసి కార్యదర్శి, మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ ఊరిలోని గండిపడిన వెంకటేశ్వర మందిర చెరువును రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, పలిమెల, మలహర్ మండలాల్లో సుమారు 16 చెరువులు ఘల్లు పడినప్పటికీ ఏ ఒక్క చెరువు గండి పనులు వేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో శివశంకర్ ప్రాజెక్టు చెరువుకు గండి పడి మూడు పంటలను రైతులు కోల్పోయారని అన్నారు.మరమ్మతు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ పనులు చేయ లేదని ప్రస్తావించారు. చెరువుల పనులు పూర్తి చేయకుండానే నీటి ఉత్సవాలు చెరువుల సంబరాలు ఎలా నిర్వహిస్తారని అన్నారు. అన్నారం ప్రాజెక్టులో నీటి దినోత్సవం సంబరాలకు విచ్చేస్తున్న మంత్రులు, అధికారులు రైతులకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రులు ఈ ప్రాంత పర్యటనకు వస్తుండటం సంతోషమని ఈ ప్రాంతానికి సంబంధించిన ఎన్నో సమస్యలు ఎన్నో సార్లు ప్రస్తావించిన పుటికీ పరిష్కరించ పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు తమ హయాంలో పూర్తి చేయనప్పటికీ ఇప్పుడు పూర్తి చేయాలని అసెంబ్లీలో కోరడం సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వర్షాకాలం ప్రారంభం ముందు 15 రోజులలో యుద్ధ ప్రాతిపదిక పై గండ్లు పడిన చెరువులు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు ఎండి అక్బర్ ఖాన్, జడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షులు కోట రాజబాబు, మండల యూత్ అధ్యక్షులు కటకం అశోక, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, చీర్ల చంద్రశేఖర్ రెడ్డి, లచ్చిరెడ్డి, యూత్ నాయకులు రంజిత్, రంజిత్ మండల సీనియర్ నాయకులు, యూత్ నాయకులు మైనార్టీ నాయకులు, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, పాల్గొన్నారు.

పంటలు అమ్ముకోలేని దుస్థితిలో రైతులు



కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేని దుస్థితిలో రైతులు ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాం నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ అధ్యక్షులు రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రైతు సమస్యలపై మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ హాజరై మాట్లాడారు. పండించిన ప్రతి గింజను కొంటానని చెప్పిన ప్రభుత్వాలు కొనుగోలు చేయక, వాహనాలు సరైన సమయానికి రవాణా చేయక అకాల వర్షాల వల్ల వరదల్లో తడిసి నష్టపోతున్న రైతుకు ఊతం ఇవ్వకుండా దశాబ్ది ఉత్సవాల్లో, రైతు ఉత్సవాల్లో, సమావేశాల్లో ప్రజా ధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని వాపోయారు. పంటను సరైన సమయానికి కొనేనాథుడు లేడన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండా పంట ఇన్సూరెన్స్ డబ్బులు కూడా దోచుకుతింటున్నారని అన్నారు. సరైన సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం భద్రపరుచుకోడానికి సరైన వసతులు కల్పించట్లేదన్నారు. తరుగు పేరుతో రైతుని దగా చేస్తున్న మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయట్లేదన్నారు. ధాన్యం రవాణా చేయడానికి వాహనాలు కాంట్రాక్టు ఒకరికె ఇస్తూ, ధాన్యం సరఫరా చేయకుండా, ఇసుక రవాణా చేస్తూ, వాహనాల చుట్టూ రైతులు కాళ్ళరిగేల తిరిగినా లాభం లేకుండా పోతోందన్నారు. అన్నదాత పుట్టెడు కష్టాల్లో ఉంటే ఆదుకోవాల్సింది పోయి ఉత్సవాల్లో పాల్గొనడం అత్యంత అమానవీయ చర్య అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న ధాన్యపు బస్తాలను వాహనాలను సమకూర్చి తరలించాలని, తరలించిన ధాన్యం యొక్క డబ్బులు రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, వచ్చే ఖరీఫ్ సీజన్ దగ్గరగా ఉండడం వల్ల పంట పెట్టుబడి కోసం వెంటనే పంట రుణాలు రైతన్నకు అందజేయాలని, పంట రుణమాఫీ కూడా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కుర్సం కన్నయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సారయ్య, జిల్లా నాయకులు కణ7తల నాగేందర్‌రావు, మండల ఉపాధ్యక్షులు తేళ్ల హరి ప్రసాద్, వేల్పుగొండ పూర్ణ, పాలడుగు వెంకటకష్ణ, కొంపెళ్లి శ్రీనివాస్ రెడ్డి, సూదిరెడ్డి జనార్ధన్ రీ3అనుబంధ సంఘాల అధ్యక్షులు చింతక్రాంతి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు పడిదల సాంబయ్య, కాడబోయిన రవి, సూడి సత్తిరెడ్డి, ఎంపీటీసీలు గుండెబోయిన నాగలక్ష్మి- అనిల్ యాదవ్, చాపల ఉమాదేవి- నరేందర్‌రెడ్డి, గోపిదాసు ఏడుకొండలు, పాశం మాధవరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

అభ్యుదయ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం

నవతెలంగాణ-గోవిందరావుపేట

పసర గ్రామపంచాయతీ పరిధిలోని అభ్యుదయ కాలనీలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని, మరమ్మతులు చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ములుగు జిల్లా కమిటీ కన్వీనర్ మంచాల కవిత కారం రజిత అన్నారు. మంగళ వారం సంఘం ఆధ్వర్యంలో రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అభ్యుదయ కాలనీలో నడవలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు రోడ్లపై రాళ్లు తేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు సుమలత సులోచన సావిత్రి సునీత సుభద్ర రాధిక భాగ్యలక్ష్మి సమ్మక్క నరసమ్మ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మహదేవపూర్

నేడు మండలం లోని అన్నారం బ్యారేజీ వద్ద నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీ చైర్మన్ శ్రీహర్షిణిరాకేష్ హాజరవుతున్నారని విజయవంతం చేయాలని ఎంపీపీ రాణి బాయ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్నారం బ్యారేజ్ గ్రౌండ్ లో జరిగే సభకు మండల ప్రజలు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు భారీగా తరలి రావాలన్నారు. సభ అనంతరం పేరిణి నృత్యం, లేజర్ షో, సినీ గాయనీ మంగ్లి బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, జెడ్పీటసీ, ఎంపీటీసీలు, దేవస్థానం చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రామ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు కమిటీ సభ్యులు, యూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, తదితరులు హాజరై విజయవంతం చేయాలన్నారు.



ఫిష్ బ్రీడింగ్ పనులను ఎంపీడీఓ పరిశీలన

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఫిష్ బ్రీడింగ్ తీయడంతో చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామపంచాయతీ పరిధి ఊరచెరువులో జరుగుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను ఉపాధి ఏపీఓ హరీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఫిష్ బ్రీడింగ్ కొలతల.. ఫిష్ బ్రీడింగ్ తీయడం వల్ల చేపల పెంపకంకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. చెరువు సారవంతమైన మట్టిని రైతులు పంట పొలాల్లో వేసుకుంటే అధిక దిగుబడికి ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కూలీలకు ఫిష్ బ్రీడింగ్ కొలతలపై అవగాహన కల్పించారు. ఫామ్ ఫౌండ్‌లో నీరు నిలువగా ఉండడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలి 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, మేట్స్ కిష్టయ్య, రమేష్, కూలీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : జెడ్పీటీసీ గుడాల అరుణ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలం అన్నారం బ్యారేజీ వద్ద కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సాగునీటి దినోత్సవం నిర్వహణ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గుడాల అరుణ మాట్లాడారు. నాలుగు మండలాలకు సంబంధించిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలన్నారు. తద్వారా 14 చెరువులు పూర్తిగా నిండి ఏటా మూడు పంటలు పండే అవకాశం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి డిపిఆర్ . పూరైందని, జల వనరుల శాఖ ఆమోదం కూడా తెలిపిందన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మేడిగడ్డ బ్యాక్ వాటర్ తో గత సంవత్సరం పడిన 40 రోజుల వర్షం కారణంగా మహదేవపూర్ మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వెంకటాపూర్

నేడు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ములుగు జిల్లా, రామప్ప దేవాలయాన్ని సందర్శించడానికి కేటీఆర్ వస్తున్నారని అన్నారు. అధిక సంఖ్యలో అందరూ పాల్గొనాలని అన్నారు. గ్రామ కమిటీలు, గ్రామ ఇన్చార్జిలు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, చైర్మన్లు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మెన్, మాజీ ఎంపీ పరామర్శ

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల కేంద్రానికి చెందిన రెడ్ క్రాస్ చైర్మన్ ,కొత్తపల్లి ప్రసాద్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది, మంగళవారం ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రసాద్, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షులు సురపునేని సాయికుమార్, ప్రధాన కార్యదర్శి లకావత్ నరసింహ నాయక్, పృధ్విరాజ్, గోవిందరావుపేట మీడియా కోఆర్డినేటర్, ఎంపీటీసీ ఆలూరి శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ ఎండి బాబర్, తొలి మలిదశ ఉద్యమకారుడు అజ్మీర సురేష్, భూక్య దేవా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నాగుర్ల పరామర్శ

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

ఇటీవలే వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను రైతు రుణ విమోచన కమీషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన బొచ్చు సరిత,పర్లపల్లి గ్రామానికి చెందిన దిండిగాల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను నాగుర్ల వెంకటేశ్వరరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ బొచ్చు సరళ శ్రీనివాస్, జిల్లా నాయకులు కొడారి రమేష్,పున్నం చందర్ రావు, ఉప సర్పంచ్ స్వామి గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షుడు కమలాకర్,నాయకులు గాజుల మల్లయ్య, భాస్కర్, అయిలయ్య,శంకర్, సదయ్య,నరేందర్, మల్లయ్య, కాశి తదితరులు ఉన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం 42 మందికి మంజూరైన కళ్యాణ్ లక్ష్మి చెక్కులను ఎంపీపీ రాణి బాయ్, జెడ్పిటిసి గుడాల అరుణ తాసిల్దార్ మాధవితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండం పుష్పలత, డిప్యూటీ తాసిల్దార్ కృష్ణ, ఆర్ఐ ఎండీ అంకుస్, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలో మంగళవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాం నాయక్ తెలిపారు.గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన గోరంట్ల సాంబశివరావుకు రూ.60,000, తుమ్మ రేష్మశ్రీకి రూ.16,500, రాఘవపట్నం గ్రామానికి చెందిన సదాశివచారికి రూ.8000, కంటెం మొగిలికి రూ.60,000 విలువైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు, సూడి సత్తిరెడ్డి, జెట్టి సోమయ్య, పాలడుగు వెంకటకష్ణ, మద్దాలి నాగమణి, రామచంద్రపు వెంకటేశ్వర్ రావు, జంపాల చంద్రశేఖర్, కంటెం సూర్యనారాయణ, పొడెం, అజ్మీర సమ్మాలు, చెన్న లక్ష్మణ్, తుమ్మ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవెలేబుల్ స్కీం డ్రా వాయిదా

నవతెలంగాణ-మహదేవపూర్

ములుగు భూపాలపల్లి జయశంకర్ విద్యార్థులు బెస్ట్ అవెలేబుల్ స్కీమ్ కింద అప్లై చేసుకున్న డ్రా నేడు ఉండగా వాయిదా వేసినట్టు ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దేశి రామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు తదుపరి తేదీ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి,సంక్షేమాల కేసీఆర్‌ను కాపాడుకోవాలి



మంత్రి దయాకర్‌రావు

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో పరుగులు పెట్టిస్తూ, దేశానికే ఆదర్శంగా నిలిపి పేదల అభివృద్ధి సంక్షేమానికి పాల్పడుచున్న సీఎం కేసీఆర్‌ను కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మాంగళ్య ఫంక్షన్ హాల్ లో బమ్మెర 1,2 ఎంపీటీసీల పరిధి బమ్మెర, రాఘవపురం, పెద్ద తండా(బి) పంచాయతీల అవాస ప్రాంతాలతో కలిపి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల కోసం ఆలోచించిన ముఖ్యమంత్రుల్లో నాడు ఎన్టీ రామారావు, నేడు కేసీఆర్ అని అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదలు, రైతులు మరిచిపోలేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేని కాంగ్రెస్, బిజెపిలు ప్రజలను మోసం చేసేందుకు అనేక వాగ్దానాలు చేస్తాయని, ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు నిర్వీర్యం అవుతున్నాయని, తెలంగాణ పథకాలను ఆయా రాష్ట్రాల్లో ఆయా పార్టీలు అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం పై అక్కసు వెలిబుచ్చడాన్ని ఖండించారు. పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో 9 ఏళ్ల క్రితమే మంత్రి పదవిని త్యాగం చేశానని తెలిపారు. తెలంగాణకే పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతున్నానని తెలిపారు. టూరిజం ప్యాకేజీ లో బమ్మెరను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నానని, అక్షరాభ్యం కోసం బాసర తరహాలో బమ్మెరను తీర్చి దిద్దుచున్నానని అన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రం సాధించుకున్న అనంతరం ప్రతి గ్రామానికి, పల్లెకు, ఆవాస ప్రాంతానికి బీటీ రోడ్లు వేసుకున్నామని తెలిపారు. అయోధ్య, భద్రాచలం తరహాలో వల్మీడీలో సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. దఫలవారీగా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మిస్తామన్నారు. బమ్మెర గ్రామ సర్పంచ్ నిర్లక్ష్యంతో ఆలేటి ఎల్లవ్వ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తిని సర్పంచ్ గా గెలిపించుకోకపోవడం బమ్మెర గ్రామ ప్రజలు చేసిన తప్పిదమని అన్నారు. సర్పంచు పదవి పోతేనే బమ్మెర గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి మదర్, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, వైస్ ఎంపీపీ ధార శారద శంకరయ్య, సర్పంచు జరుపుల మోజీ బాలు నాయక్, ఎంపీటీసీ బానోతు చత్రు నాయక్, ఉపసర్పంచ్ శివరాత్రి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు బత్తిని గోపాల్ గౌడ్, లకావత్ బాలు నాయక్, జోగు గోపి లతోపాటు ఆయా గ్రామాల ఇన్చార్జులు, బి ఆర్ ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ సేవలు అందించడంలో తెలంగాణ భేష్



జిల్లా కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య

నవతెలంగాణ - ములుగు

డిజిటల్ సేవలు అందించడంలో తెలంగాణ బెష్ అని,ఐటీ, పరిశ్రమల అబివృద్ధిలో ములుగు జిల్లా ముందంజలో ఉందని జిల్లా కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య అన్నారు. తెలంగాణ పారిశ్రామిక,ఐటి ప్రగతి దినోత్సవం సందర్భంగా మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మీసేవ, ఆధార్, సిఎస్సి, ఇండస్ట్రీస్ రంగాల స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసి డిజిటల్ సర్వీసుల గురించి వివరించారు. పలు ఐటీ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మీసేవ, ఆధార్, సిఎస్సి లను సత్కరించి మెమొంటోలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఈజీపి ద్వారా దాదాపు 50 మంది జీవనోపాధి కల్పించామని చెప్పారు. యువత ను పారిశ్రామిక రంగం లోకి వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. టీఎస్ ఐ పాస్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం పారి శ్రామిక రంగంలో విప్లవం తీసుకోచ్చిందని అన్నారు. గ్రామ గ్రామాన ప్రతి పౌరునికి డిజిటల్ సేవ అందించటంలో మీసేవ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ రంగంలోని అన్ని రకాల సేవలను మీసేవ ద్వారా అందించటంలో మీసేవ కేంద్రాల నిర్వాహకులు కృషిని కూడా ప్రశంసించారు.ఇప్పటికీ 30 కోట్ల ట్రాన్సక్షన్లు ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలను అందించి మన తెలంగాణ రాష్ట్రానికి డిజిటల్ సేవ రంగంలో అగ్రగామిగా నిలిపారని కొనియాడారు.ఆధార్ సేవలలో కూడా ములుగు జిల్లా లో ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ ప్రోగ్రాం ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ప్రతి పల్లెల్లో ,పట్టణాల్లో కాంప్ ల రూపం లో నిర్వహించి మన జిల్లాను మొదటి స్థానంలో నిలుపటమే కాకుండా పౌరులకు వారికి అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. మీసేవ 2.0 ద్వారా,టి - వాలెట్, టి - అప్ ఫాలో లాంటి మొబైల్ యాప్ లను ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చి ,కులం,ఆదాయం,నివాసం, రిజిస్ట్రేషన్,ఆర్టిఎ సర్వీసెస్,లాంటి ప్రభుత్వ రంగ సేవలను ఇంటి వద్ద నుండే అప్లై చేసుకునే వీలు కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఐటీ శాఖ ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ ,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,ఎస్సీ కార్పొరేషన్ ఈడి తులా రవి, ఎల్ డి ఎం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూములు, పోడు భూముల పట్టాలు అందించాలి



కేయూ మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

నవతెలంగాణ- ములుగు

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూములు, పోడు భూముల పట్టాలు అందించాలని కేయూ మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు.ములుగు జిల్లా కేంద్రంలో గ్రామపంచాయతీ గెస్ట్ హౌస్ సమావేశ హాల్లో ములుగు జిల్లా జేఏసీ సమావేశం జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణగౌడ్ హాజరై మాట్లాడుతూ ములుగు జిల్లా ఉద్యమాల పోరాట ఫలితంగానే ఏర్పడిందని అన్నారు. కేటీఆర్ నేడు ములుగు వస్తున్న సందర్భంగా ములుగు పట్టణంలోని పేదలకు డబుల్ బెడ్ రూములు వెంటనే ఇవ్వాలని, అసంపూర్తిగా గత నాలుగు సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్లో పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ తరగతులు జాకారం వైటిసి భవనంలో తరగతులు ప్రారంభించాలని, ములుగు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గట్టమ్మ వద్ద గుడిసెలు వేసుకుని నాలుగు సంవత్సరాల నుండి నివసిస్తున్నారని పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు శనిగరపు నరేష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో మల్లంపల్లి రాజుపేట లక్ష్మీదేవిపేట మండలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిల్ట్ ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ఏటూరు నగరం రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని ములుగు జిల్లాకు సమ్మక్క సారక్క నామకరం చేయాలన్నారు. బిల్ట్ ఫ్యాక్టరీ జేఏసీ నాయకులు వెంకటాచారి మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూతపడి చాలా సంవత్సరాలు గడుస్తున్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కార్మికులు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని, వెంటనే బిల్ట్ ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ మా జిల్లా సాధించుకున్నామన్నారు. కానీ ములుగు జిల్లాలోని సమస్యలు పోడు భూములకు పట్టాలు ప్రతి ఒక్కరికి అందరికీ ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కేటీఆర్‌కు వినతి పత్రం ఇచ్చేలా బీఆర్ఎస్ ప్రజాప్రతితులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను కేటీఆర్ అమలు చేయాలని, ఇందుకు కేటీఆర్ స్పష్టంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మహిళా సంఘం నాయకులు సిపిఐ పార్టీ మండల నాయకులు ఇంజన్ కొమురయ్య గుడిసె వాసుల సంఘం నాయకులు నాంపల్లి నాగరాజు, నాయకపోడు పోడుదెబ్బ మహిళా రాష్ట్ర నాయకులు తైనేని సరోజన, ఝాన్సీ, డబుల్ బెడ్ రూమ్ ల పేదల సంఘ నాయకులు లక్ష్మి, సమ్మక్క, స్వరూప బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పెండం బిక్షపతి, బహుజన సమాజ్ పార్టీ నాయకులు రఘువీరు, గట్టమ్మ గుడిసె వాసుల సంఘం నాయకురాలు రేష్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే కేటీఆర్ ములుగులో అడుగు పెట్టాలి : బీజేపీ

బిజెపి మండల అధ్యక్షుడు జవహర్ లాల్

నవతెలంగాణ-ములుగు/వెంకటాపూర్

గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాకే కేటీఆర్ ములుగులో అడుగు పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం కారు పోతుల దేవేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా జవహర్ లాల్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అమలు గాని హామీలను ఇస్తూ పబ్బం గడుపుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించలేని దుస్థితిలో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రతి ఒక్కరు అలుపెరుగని పోరాటం చేస్తే కేసీఆర్ మాత్రమే తెలంగాణ సాధించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజా సమస్యల పరిష్కారంలో చేసిన సేవలు మరిచిన ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కేటీఆర్ పర్యటన వల్ల ములుగు జిల్లాకు ఒరిగేదేమీ లేదని అన్నారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ సంపదగా బీజేపీ ప్రభుత్వం యునెస్కో గుర్తింపు తీసుకువచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. కేటీఆర్ కు కళ్ళుంటే రామప్ప సరస్సులోని ధ్యాన కేంద్రాన్ని అభివద్ధి చేయాలని అన్నారు. మత్తడిని వెడల్పు చేస్తూ సరస్సు కట్టను పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చి హామీలు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు సైతం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడేలా పనిచేయాలని కోరారు. బిజెపి నాయకులు యాదగిరి, పెంచికాల నాగయ్య, సంతోష్, ధరమ్ సింగ్ ,తక్కల్లపల్లి సుమన్ రావు ,తంగళ్ళపల్లి శ్రీధర్, రూప్సింగ్ ,సోనా సింగ్, కపాన్వేష్, రెడ్డి సతీష్ ,అజ్మీర రమేష్, రాసమల్ల కుమార్, గువ్వ శరత్ ఉన్నారు.